₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 8 సంచిక - 16
పక్షపత్రిక ఆగస్టు 16-31, 2017



## పోలవరంపై ఆలస్యంగా మేలుకొన్న పాలకులు



## ప్రస్తుతం ఎన్నికల రాజకీయాల జోలికిపోకండి, సమాజాభివృద్ధికి పాటుపడండి...విద్యార్థులు, యువతకు జేపీ పిలుపు



## మీ ఊరినీ మార్చుకోవచ్చు అలందూర్‌లా !





## యూత్ ఫర్ లైబ్రరీస్



# దక్షిణ చిరువోలులంక రైతుల డిమాండ్

2009లో కృష్ణానదికి 25లక్షల క్యూసెక్కుల వరద వచ్చినప్పుడు నష్ట నివారణ చర్యల్లోనే కాకుండా సహాయపునరావాస కార్యక్రమాలలో కూడా లోక్‌సత్తా పాలుపంచుకుంది. బాధితులకు ఆహార పదార్థాలు, మందులు, దుస్తులు, మంచినీరు వంటి తక్షణావసరాల్ని అందించటంతోపాటు... వరద ధాటికి దెబ్బతిన్న తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్రలోని నాలుగు గ్రామాలను (కేశవరం, దొడ్డిపాడు/పూలతోట, దక్షిణ చిరువోలులంక, వెంకట్రాజుపాలెం) దత్తత తీసుకుని అక్కడ పాఠశాలను పునర్నిర్మించటం, రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు,  ఎత్తిపోతల పథకం పునర్నిర్మాణం, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు, మద్య నియంత్రణ వంటి కార్యక్రమాలను చేసింది. వరద నష్టంపై ప్రధానమంత్రిని కలిసి, కేవలం 10-11 లక్షల క్యూసెక్కుల వరదను మాత్రమే తట్టుకునే అవకాశమున్న కృష్ణానది వరద కట్టల పటిష్ఠ మరమ్మతుల నిధులను లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సాధించారు. పంట సీజన్ల మీద ప్రభావం చూపుతున్న వాతావరణ మార్పులపై అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీ ఏర్పాటు ఆవశ్యకతను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. కృష్ణాజిల్లా అవనిగడ్డ మండలంలోని దక్షిణ చిరువోలులంకలో లోక్‌సత్తా నిధులతో ఏర్పాటు చేసిన ఫీడర్ కాలువ ఇది. ఈ కాలువ పంపుల్ని మరమ్మతు చేయమని ప్రభుత్వాన్ని రైతులు, లోక్‌సత్తా చాన్నాళ్లుగా కోరుతున్నా పట్టించుకోవటం లేదు. ఇక్కడ చిన్నపాటి చర్యలు తీసుకుంటే ఇంకొన్ని వందల ఎకరాలు సాగులోకి వస్తాయి.

జన రాజకీయం కోసం...


# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

ఆగస్టు 16-31, 2017 సంపుటి - 8 సంచిక - 16

## లోపలి పేజీల్లో...

ప్రస్తుతం ఎన్నికల రాజకీయాల జోలికి పోకండి.................................................. 5
భవిత పట్ల బెంగలేని మన యువత..................7
గ్రంథాలయాల బూజు దులుపుతున్న నరసింహ, షీలూ రాజ్ ..............................................11
ది విలేజ్ లైబ్రరీ ప్రాజెక్టు................................14
జనసమీకరణ కేంద్రాలు గ్రంథాలయాలు........... 15
గెలవండి, సమాజాన్ని గెలిపించండి! .............. 22
పోలవరంపై పాలకులు ఆలస్యంగా................ 24
డ్రగ్స్ యుద్ధం ప్రకటించాల్సిందే...................... 26
చిన్నగ్రామం నుంచి హైదరాబాద్, విజయవాడ... 31
విద్య, ఆరోగ్యం, ఉపాధిని అందించేవాడే ..........34




# కార్టూన్ కార్నర్

*సంపాదక వర్గం*

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |


- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : **సునీత ఆరిమిల్లి**

# ఉడుతాభక్తా? పౌరశక్తా?



శ్రీరాముడు లంకను చేరడానికి సముద్రంపై చేపట్టిన సేతు నిర్మాణంలో చిన్న ఉడుత కూడా సాయం అందించింది. ఆ ఉడుత వలే ప్రజలు కూడా నిబద్ధతతో ఉంటే భారతదేశం గొప్ప శిఖరాలకు చేరుకుంటుంది" అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల హితవు పలికారు. ప్రజల రాష్ట్రపతిగా పేరొందిన డా॥ ఏపీజే అబ్దుల్ కలాం పేరిట తమిళనాడు రామేశ్వరంలోని పేకరంబులో నిర్మించిన స్మారకకేంద్రాన్ని ప్రారంభిస్తూ ప్రధాని ఈ మాటలన్నారు. కలాం కలను సాకారం చేయడానికి ప్రతి పౌరుడూ ఎంతోకొంత తన వంతు బాధ్యతను నెరవేర్చాలన్న సదుద్దేశంతో ప్రధాని ఆ మాటలు అనుండొచ్చు. అదేవిధంగా, ఉడుత చిన్న జీవే అయినా ప్రత్యేకతలో మనిషికేమీ తీసిపోదు. చెట్టను పెంచటానికి, పర్యావరణాన్ని రక్షించటానికి మనం పనిగట్టుకుని విమానాల్లో విత్తన బంతుల్ని వెదజల్లుతున్నాం. కానీ ఉడుతలు తాము తిన్న పండ్ల గింజల్ని భూమిలో వేర్వేరు చోట్ల తమ జీవనశైలిలో బాగంగానే విత్తుతూ మొక్కల విస్తరణకు నిశ్శబ్దంగా దోహదం చేస్తుంటాయి. ఉడుత నుంచీ మనం నేర్చుకోవలసిన విషయాలున్నాయి. ఈ సానుకూలాంశాలతో ఆలోచించినా.. రామేశ్వరం రామసేతు (ఈ కట్టడం నిజమా, కేవలం కథా అనే అంశాన్ని పక్కనపెడితే) నిర్మాణంలోని ఉడుతాభక్తిని ప్రజాస్వామ్య వ్యవస్థలోని పౌరసత్వంతో పోల్చటం అసంబద్ధమైనది. ఒకపక్క నూతన భారత్ కోసం తపించిన కలాంను, ప్రజాస్వామ్యంలో ప్రజల పాత్రను పొగుడుతూనే మరోపక్క ఉడుతాభక్తిని ప్రధాని బోధించారు. పెద్ద ప్రసంగంలోని ఓ చిన్న వ్యాఖ్య గురించి ఇంత సంశయం వ్యక్తం చేయటం అవసరమా అనుకోవచ్చు. కానీ ఓటు వేయటం వరకే ప్రజల పాత్ర, ఆ తర్వాత అంతా ప్రభుత్వమే చూసుకుంటుంది, ప్రధాని చెప్పిన పనులు చేయటమే గొప్ప దేశ సేవ.. అనే కేంద్రీకృత, గుత్తాధిపత్య వ్యవహారశైలి వైపు మోదీ మొగ్గు ఉన్నకొద్దీ పెరుగుతుండటం వల్ల సంశయలాభాన్ని ప్రజాస్వామ్యానికి ఇవ్వటానికి అభ్యంతరం వ్యక్తం చేయకతప్పటం లేదు. పాలనను పూర్తిగా తన గుప్పెట్లో పెట్టుకునే ప్రయత్నం ఇంత పెద్ద దేశంలో, సంక్లిష్ట భిన్నత్వం ఉన్న సమాజంలో పలు అనర్థాలకు దారితీస్తుందని ప్రధాని గుర్తించటం లేదు. ఏ మంత్రిత్వ శాఖ ఫైలయినా తనకకనుసన్నల్లో నుంచే వెళ్లాలని శాసిస్తుండటం పట్ల కేంద్రమంత్రులే సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన రాజకీయ వేదిక బీజేపీని దేశవ్యాప్తంగా ఓట్లు, సీట్లుపరంగా గెలిపించుకునేందుకు మోదీ అనుసరిస్తున్న ధోరణులు కూడా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ కొత్త సమస్యల్ని జతచేస్తున్నాయి. బీహార్‌లో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ పచ్చి అవకాశవాద రాజకీయం చేయటానికి లాలూ మూర్ఖత్వంతోపాటు బీజేపీ మితిమీరిన విస్తరణ కాంక్ష కూడా కారణం. నితీష్ నిజాయతీపరుడేగానీ, దేశవ్యాప్తంగా ఇమేజ్ ఉన్నంత గొప్ప సుపరిపాలకుడేమీ కాదని ఈవేళ కామెంట్ చేయటం తేలికే. కానీ బీహార్‌లోని కుల రాజకీయాలు, అవినీతి స్వభావం తెలిసినవారెవరైనా అక్కడ పాలనను గాడిలో పెట్టటానికి నితీష్ పడ్డ కష్టాన్ని తేలిగ్గా తీసేయలేరు. బీహార్‌లాంటి రాష్ట్రాలకు ఎక్కువ నిధులు ఇస్తున్నారని దక్షిణాది రాష్ట్రాల నుంచి ఆరోపణలు వస్తున్నా.. అలా ఇవ్వాల్సిందేనని ప్రభుత్వాలతో నేను గట్టిగా వాదించాను. నా పేరు చూసి పార్లమెంటు కమిటీల్లోని సభ్యులు 'మీది బీహారా' అని అడిగిన సందర్భాలున్నాయి. బీహార్, యూపీలను బాగుచేసుకోకుండా మనం భారతదేశాన్ని బాగుచేసుకోలేం. దేశం మొత్తం మీదా ఒక్కరంటే ఒక్క ముఖ్యమంత్రిని కూడా నితీష్ స్థాయిలో చూపించలేనప్పుడు, ప్రస్తుత అవకాశవాదంపై కూడా ఒక మేర దాటి విమర్శించలేం. ఆయనకున్న అతి పెద్ద లోపం- తగినంత వ్యవస్థీకృత నిజాయతీ లేకపోవడం! మారిన పరిస్థితులకనుగుణంగా మోదీ అనుసరిస్తున్న విధానాలను, వ్యూహాలను చిత్తుచేయగల కొత్త రాజకీయం, ఎజెండా నితీష్ వద్ద లేదు. బీజేపీకి దీటుగా కనీస ఓట్ల శాతమున్న జాతీయ పార్టీ కాంగ్రెస్ పరిస్థితి మరీ దయనీయంగా మారటంతో నితీష్‌కు ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. ప్రతిపక్షం అంటే రియాక్షన్లు ఇవ్వటం కాదు, నిర్మాణాత్మక ప్రత్యామ్నాయం చూపటం అని నితీష్ చేసిన విమర్శకు కాంగ్రెస్, ఆ పార్టీ మిత్రపక్షాల వద్ద సమాధానం లేదు. ఇందిరాగాంధీ హయాం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వాల్ని పసలేని ఆర్థికవిధానాలు, అర్థంలేని పందేరం పథకాల పేరుతో భ్రష్ట మార్గం పట్టించిన సోషలిస్టు భావజాలురు కుహనా లౌకికవాదంతో చేస్తున్న నెగెటివ్ రాజకీయంతో ప్రజలు విసిగిపోయారు. అటువంటి కాంగ్రెస్ కూటమి కంటే మొహమాటం లేకుండా వ్యవహరిస్తున్న మోదీ మేలని భావిస్తున్నారు. పేదలకు ఉచితాలు, మినహాయింపులు అవసరమే. కానీ వాటితోపాటు మంచి విద్య, ఆరోగ్యం, ఉపాధి లేకుండా పేదరికం ఎలా పోతుంది? పాలనలో ఎలా భాగస్వాములు కాగలుగుతారు? అనే స్పృహే మనదేశంలో సోషలిస్టు భావజాలురకు కరవైంది. విధి లేని పరిస్థితుల్లో 1990లలో లైసెన్స్‌రాజ్ పద్ధతుల్ని కొంతమేర తొలగించినా.. ఆర్థికవ్యవస్థ శరవేగంగా ఎదుగుతున్న సమయంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే-1 ప్రభుత్వం సగం పదవీకాలం దాటాక మళ్లీ ఇందిరాగాంధీ హయాంలోని విధానాలకు మళ్లింది. ప్రజలను విభజించే రాజకీయాన్ని అందుకు జోడించింది. అందుకే ప్రధాని మన్మోహన్‌సింగ్ అభ్యర్థన మేరకు యూపీయే-1లో జాతీయ సలహామండలిలో, పరిపాలనా సంస్కరణల సంఘంలో కీలక పాత్ర పోషించినా 2007 నుంచి క్రమంగా దూరాన్ని పాటించాను. 2009 ఎన్నికల్లో మళ్లీ గెలవటంతో తమ పాత రాజకీయ విధానాలే కరెక్టన్న భ్రమ కాంగ్రెస్‌వారిని కప్పేసింది. ఇందిరాగాంధీలోని వ్యక్తిత్వ బలాన్ని, కాంగ్రెస్‌లోని సంస్థాగత, పాలనా బలహీనతల్ని ఆసరాగా చేసుకుని మోదీ 2014లో చరిత్రాత్మక విజయం సాధించారు. కనీసం నితీష్ కుమార్‌కు ఉన్నపాటి పాలనా ఎజెండాను కూడా కాంగ్రెస్ పెంపొందించుకోలేకపోయింది. నితీష్‌ను కాంగ్రెస్ కూటమి నుంచి బైటికి లాగగలిగితే, అవినీతి, వంశపారంపర్య రాజకీయాలకు వ్యతిరేకమని తమ పార్టీకున్న ఇమేజ్ ఇంకా బలపడుతుందని, 2019లో గెలుపు నల్లేరు మీద నడకేనని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా భావిస్తున్నారు. వారు అలా గెలవొచ్చు కూడా. కానీ ప్రజలు పౌరులుగా ఎదిగే అవకాశాల్ని, వ్యవస్థల్ని నిర్మించకుండా ఉడుతాభక్తితో పనిచేసేవారుగా మార్చాలనుకోవటం, మరే పార్టీకీ అవకాశం లేని రీతిలో అప్రజాస్వామిక రాజకీయం చేయడం వల్ల భవిష్యత్తులో తమకూ ఇప్పటి కాంగ్రెస్ పరిస్థితే రావొచ్చని వారు గుర్తించటం లేదు. తమ అప్రతిహత విజయాల్లోనే ఓటమికి కూడా బీజాలు వేసుకుంటున్నామని గ్రహించటం లేదు. ప్రజాస్వామ్యంలో రామచంద్ర ప్రభువులుండరు. శ్రీరామచంద్రుడూ సేవకుడే! ప్రజలు ఉడుతల్లా రామకార్యం కోసం పనిచేయరు, పౌరశక్తితో ప్రభువుల్లా ఉండే ప్రజలకార్యం కోసమే రాముడు పనిచేస్తాడు. ప్రజలు తమ ఓటు, భావప్రకటనా స్వేచ్ఛ విలువ తెలుసుకున్నప్పుడు, సముద్రాన్ని లంఘించిన హనుమంతుడిలా ఈ వాస్తవాన్ని బలంగా రుజువుచేస్తారు. ప్రజల్లో ఈ పౌరసత్వాన్ని పెంచేవారే, పరిరక్షించేవారే నిజమైన నాయకులు, పాలకులు, దేశనిర్మాతలు. ఇలాంటి ప్రజాస్వామ్యంతోనే ఉద్దాత్తభారత్ సాధ్యం తప్ప ఉడుతస్వామ్యంతో కాదు. ప్రజల్లో పౌరసత్వాన్ని పెంచేందుకు కావలసిన ఎజెండాను, వికేంద్రీకరణ పద్ధతులను, బహుళత్వ విలువలను అమలుచేయటానికే మోదీని ఎన్నుకున్నది. మోదీ తన వ్యక్తిగత నిజాయతీని కొంతైనా వ్యవస్థీకృత నిజాయతీగా మార్చుకుని.. విద్య, ఆరోగ్యం, యువతకు ఉపాధి, రైతుకు లాభం, చట్టబద్ధపాలన, రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు, స్థానిక స్వయంపాలన వంటివి చేపడతారని మాలాంటివాళ్లం ఇంకా ఎదురుచూస్తున్నాం. బలమైన ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తూ అమూల్యమైన దేశ సమయాన్ని వృథా చేయకుండా ప్రతి నిముషాన్నీ లక్ష్యం దిశగా సద్వినియోగం చేసేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నాం. బంతి ఇంకా మోదీ కోర్టులోనే ఉంది.



⊙

# ప్రస్తుతం ఎన్నికల రాజకీయాల జోలికి పోకండి, సమాజాభివృద్ధికి పనిచేయండి.. విద్యార్థులు, యువతకు జేపీ పిలుపు

ఇప్పుడున్న పరిస్థితుల్లో విద్యార్థులు, యువత ఎన్నికల రాజకీయాల జోలికి పోవటం అనవసరమని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సూచించారు. సమాజానికి సేవ చేయాలనే పట్టుదల ఉంటే విజయం దానంతటదే వరిస్తుందన్నారు. మనదేశంలో ఏటా 1.30కోట్ల మంది ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటే 30శాతం మందికే అవకాశాలు దక్కుతున్నాయన్నారు. నార్వే లాంటి చిన్న దేశాల్లో బయోఫ్యూయెల్ అందుబాటులోకి వచ్చి పెట్రోలియం ఉత్పత్తి ధరలు తగ్గుతున్నాయని, మనదేశంలోని వనరులు ప్రజల చెంతకు చేరే విధంగా యువత కృషి చేయాలన్నారు.

భీమవరం పట్టణంలోని ఎన్‌ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో జేపీ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, పరిశోధనా విభాగం డీన్ పీఏ రామకృష్ణంరాజు (పార్క్‌రాజు), వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కేవీఎస్ఎన్ రాజు తదితరులు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

భారతదేశానికి ఎన్నో వనరులు ఉన్నా సమగ్ర అభివృద్ధిలో వెనకబడటానికి నిర్వహణ, పరిపాలనా లోపమే కారణమని జేపీ అన్నారు. ప్రజల శక్తిసామర్థ్యాలను వెలికితీసే విద్య, ఆరోగ్యం, ఉపాధి గురించి కాకుండా యాంత్రిక జీవనాన్ని ప్రోత్సహించే పాలన కొనసాగుతుండటం వల్ల కొన్ని తరాలు అవకాశాలు కోల్పోతున్నాయన్నారు. దేశంలోని సంపదను, వనరులను పేదరికాన్ని తొలగించే నిజమైన విధానాల కోసం వినియోగిస్తే ప్రతి ఒక్కరూ సంపదసృష్టిలో భాగస్వాములై భారత్ అగ్రస్థానానికి చేరుకుంటుందన్నారు.



## రైతుల ఆత్మహత్యల పాపం పాలకులదే!

తెలుగు రాష్ట్రాలోనూ, దేశంలోనూ రైతుల ఆత్మహత్యలకు కారణం ప్రకృతి శాపం కాదని, పాలకుల పాపమేనని జేపీ అన్నారు. ఉపన్యాసాలతో వ్యవసాయాన్ని నీరుగారుస్తున్నారని, రైతులను విభజించి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రపంచంలో ఎనిమిదోవంతు వ్యవసాయ భూమి మనదేశంలో ఉందని, ఎక్కడాలేనంత సూర్యరశ్మి, జలవనరులు ఉన్నా వాటిని సక్రమంగా వినియోగించుకోవటం లేదని అన్నారు. ఆకివీడులో లోక్‌సత్తా నేతలు బండారు రామ్మోహనరావు, గొట్టిముక్కల జానకిరామరాజు తదితరులతో కలిసి వ్యవసాయ సంక్షోభంపై ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుకు ఆదాయం పెంచేలా పంట ధర వచ్చే మార్గాలను వెతకటం మానేసి విదేశాల నుంచి దిగుమతులు చేసుకునేందుకు పాలకులు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. డిమాండ్ లేనప్పుడు పంట నిల్వ చేసుకుని, రైతులు బ్యాంకుల నుంచి ప్లెడ్జి రుణాలు పొందేలా గోదాములు, శీతల గిడ్డంగుల నిర్మాణం కూడా చేయటం లేదన్నారు. కొన్ని నెలల క్రితం మిర్చి పంటను రైతులు అయినకాడికి తెగనమ్ముకోవటమో, తగులబెట్టటమో చేశారని, ఇప్పుడు మాత్రం రేట్లు పెరుగుతున్నాయని అన్నారు. ధరల స్థిరీకరణ నిధి, సరైన నిల్వ, ప్లెడ్జి రుణ సదుపాయాలు ఉంటే ఈ దుస్థితి ఉండేది కాదన్నారు. రైతుల చేతుల్లో ఉండాల్సిన మార్కెట్ యార్డులను రాజకీయ వర్గాలతో నింపేస్తున్నారన్నారు. రైతుల నుంచి 12శాతం మార్కెట్ సెస్సును వసూలు చేస్తూ వేలకోట్లు దండుకుంటున్న ప్రభుత్వాలు ఆ డబ్బును ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. ఏపీ రైతాంగ సమాఖ్య ఉపాధ్యక్షుడు యెర్నేని నాగేంద్రనాథ్, ఫిషరీస్ రాష్ట్ర అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాయిన సువర్ణ, పిన్నమరాజు గోపాలరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఇంజినీరింగ్ స్టూడెంట్స్ ప్రశ్నలకు జేపీ జవాబులు:

⊙ నేను సాధించింది చాలా తక్కువ. చదువుకునే రోజుల్లో, ఉద్యోగం చేసిన సమయంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకే రాజకీయాల్లోకి వచ్చాను. కనీసం 15శాతం మంది నా వెనక ఉంటే సరిపోతుంది. భవిష్యత్తులో తెలుగురాష్ట్రాలే కాదు, దేశం కూడా అభివృద్ధి చెందుతుందనే ఆలోచనతో వచ్చాను. ప్రజలు లోక్‌సత్తా

## కులానికే కాదు, పేదరికానికీ రిజర్వేషన్

భారతదేశంలో కులవివక్షను కూకటివేళ్లతో పెకలించి వేయాలని జేపీ అన్నారు. కులం సామాజిక సమస్య తప్ప రాజకీయ సమస్య కాదని, అయితే కులనిర్మూలనకు తగిన విధానాలను అనుసరించాల్సిన బాధ్యత రాజకీయానిదేనని అన్నారు. రిజర్వేషన్లను స్వార్థ ప్రయోజనాల కోసం కాకుండా అణగారిన కులాల కోసం వినియోగించాలన్నారు. కులవివక్షతోపాటు పేదరిక వివక్షను ఎదుర్కొంటున్న వారందరికీ కూడా రిజర్వేషన్ తరహాలో అదనపు అవకాశాల్ని కల్పించాల్సుందన్నారు. కాపు రిజర్వేషన్‌ల కోసం పోరాటం తప్పుకాదన్నారు. ఏపీలో కులాల కురుక్షేత్రం బాధ కలిగిస్తోందన్నారు. విద్యార్థులు కులాల వల్ల నష్టపోతున్నారన్నారు. రాజకీయ కోణంలో కాకుండా సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

## వంశాల కోసం కాకుండా, ప్రజల కోసం పాలన సాగాలి

ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు తప్ప వంశపారంపర్యాలకు ఆస్కారం ఉండదని జేపీ అన్నారు. అమరావతి భూసేకరణ విధానం, నిర్మాణం రాష్ట్రాభివృద్ధి దిశగా ఉన్నాయని, అయితే అభివృద్ధి, పాలనను వికేంద్రీకరించాలన్నారు. వంశాల కోసం కాకుండా ప్రజల కోసం పాలన సాగాలన్నారు.

ఆలోచనల్ని అభినందించారుగానీ, కనీస స్థాయి ఓట్లు వేయటానికి సిద్ధపడలేదు. అందుకే ఎన్నికల రాజకీయానికి విరామమిచ్చి లక్ష్యాల కోసం వేరే మార్గంలో కృషి చేస్తున్నాను. ఈ దేశంలో రాజకీయ పార్టీలకు లోటు లేదు. అంతకంటే ముందుగా నాయకులకు కొరత లేదు. లోక్‌సత్తా ఆ పార్టీలకు, ఆ నాయకులకు ప్రత్యామ్నాయంగా రాలేదు. ఓ ప్రత్యామ్నాయ రాజకీయం అందించటానికి వచ్చింది. ఏ రంగంలోనైనా నేను నామమాత్రపు విజయం సాధించాను.

- ప్రస్తుతం యువత ఎన్నికల రాజకీయాల జోలికి వెళ్లవద్దు. దేశంలో ఎక్కడ చూసినా డబ్బు రాజ్యమేలుతోంది. చిన్న పంచాయతీలో సర్పంచి ఎన్నికకు రూ.50లక్షల నుంచి రూ.కోటి ఖర్చు చేస్తున్నారు. కొందరు శాసనసభ్యులు రూ.30 నుంచి 50 కోట్లు వరకు వెదజల్లుతున్నారు. దీన్నిబట్టి రాజకీయం ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సమాజానికి సేవ చేసేలా యువత కృషి చేస్తే సరిపోతుంది.
- నేడు దేశంలో ప్రభుత్వ విధానాలు బాధిస్తున్నాయి. సంపన్నుల పిల్లలకే అందలం అన్నట్టు ఉంది. మాట్లాడటం తెలియకపోయినా రాజకీయ నాయకులుగా, మంత్రులుగా

## పవన్ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలి

ప్రజాస్వామ్యంలో పోరాడేవారిని ఆహ్వానించి ప్రోత్సహించాలని, అందువల్ల జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను స్వాగతించాలని జేపీ అన్నారు. పవన్ పోరాటం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలన్నారు. పార్టీ రాజకీయాల కోసం కాకుండా మౌలిక మార్పుల కోసం 2019 ఎన్నికలు వేదిక కావాలన్నారు.

## త్వరలో 100రోజుల జనచైతన్య యాత్రలు

లోక్‌సత్తాకు పదవుల మీద ఆశలేదని, తాము కోరుకున్న సమాజ నిర్మాణం జరిగే వరకు పోరాడతామని జేపీ అన్నారు. అందుకే త్వరలో పార్టీలకతీతంగా 100రోజుల జనచైతన్య యాత్రల్ని తొలుత ఆంధ్రప్రదేశ్‌లో, ఆ తర్వాత తెలంగాణలో చేపడుతున్నామన్నారు.

చెలామణి అవుతున్నారు. దాంతో ఏ రంగంలో చూసినా అభివృద్ధి కానరావడం లేదు.

- తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో 70శాతం మంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు మూడంకెల భాగాహారం, రెండంకెల గుణకారం రాదు. కేవలం మార్కులకే చాలా విద్యాసంస్థలు, తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో విలువలు పడిపోతున్నాయి. అలాకాకుండా నాణ్యమైన విద్యను అందిస్తే భవిష్యత్తులో ఏ రంగంలోనైనా పిల్లలు రాణించే అవకాశం ఉంటుంది.
- లక్షలమంది ఉద్యోగ పరీక్షలకు హాజరైనా కేవలం పదులలోనే ఎంపికవుతారు. వారిలో ఎందరు సమాజానికి ఉపయోగపడతారు అంటే, ప్రశ్నార్థకమే! చాలామంది ఉపాధి పొందేవరకు ఒకరకంగా, తర్వాత వేరేలా మారిపోతుండటం కనిపిస్తోంది. ప్రధానంగా విద్య, వైద్యం విషయంలో పూర్తి మార్పులు చోటుచేసుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యం. సమాజానికి ఉపయోగపడేలా పరిశోధనలు చేసే ఆలోచనలు ఉంటే ఉపాధిలో ఎక్కడైనా స్థిరపడే అవకాశం ఉంటుంది.
- ఆక్వా సాగుతో దేశానికి ఆర్థిక సంపదను అందిస్తున్న డెల్టా ప్రాంతంలో రోడ్లు, డ్రెయిన్ల దుస్థితి ఆందోళన కలిగిస్తోంది. ఇంత అధ్వాన్నంగా నేను ఎప్పుడూ చూడలేదు. అభివృద్ధి అంటే రోడ్లు, డ్రెయిన్లు కూడా బాగుండాలి.
- చట్టబద్ధమైన పరిపాలన, ఆరోగ్యం, విద్య, మౌలిక వసతుల ఏర్పాటు ఉండాలి. ఏ రంగంలోనైనా విడుదలైన నిధులు ఎంతమేర ఉపయోగపడుతున్నాయో పరిశీలన అవసరం. నేడు అటువంటి వ్యవస్థ లేకపోవడంతో నిధులు దుర్వినియోగం కావడంతోపాటు అభివృద్ధిలో వెనకబడుతున్నాం. ■

# భవిత పట్ల బెంగలేని మన యువత

**- ఆకార్ పటేల్**



**నా** పనిలో భాగంగా ఏళ్ల తరబడి నేను వందలాది మంది శ్రోతలతో మాట్లాడుతుంటాను. అలా నేను అనేక వేలమందితో, బహుశా లక్షలమందితో మాట్లాడి ఉంటాను.

తరచుగా వారు కళాశాల విద్యార్థులైన యువతీయువకులు. మొదట నేను ఏదో ఒక అంశంపై ఓ అరగంటో లేక నలభై నిముషాల పాటో మాట్లాడటం, ఆ తర్వాత శ్రోతలు తమ అభిప్రాయాలు వెలిబుచ్చడం లేదా ప్రశ్నలు వేయడం అనే తీరున సాధారణంగా ఈ సంభాషణ సాగుతుంటుంది.

గత కొన్ని నెలలుగా కొన్ని రాష్ట్రాల్లో పెద్ద పెద్ద బృందాలతో మాట్లాడాక, శ్రోతలలో నాకు కనిపించిన కొన్ని సాధారణాంశాల గురించి తీవ్రంగా యోచిస్తున్నాను.

మొట్టమొదటిది వారి దృక్పథానికి సంబంధించినది. అతి పెద్ద సంఖ్యలో నేను కలుసుకున్నవారి నుంచి అందిన సమాచారం ఆధారంగా మనదేశంలోని పిల్లలు తిరుగుబాటుతత్వం గలవారు కారని, సంప్రదాయకంగా ఉండేవారని నాకు స్పష్టమైంది. ఆధిపత్యం చెలాయించే బాపతువారికి కూడా ఇది వర్తిస్తుంది. అలాంటివారు తరగతి గదిలో ఉన్నా, రాజకీయాల్లో ఉన్నా, పాత్రికేయులుగా ఉన్నా లేక సెలబ్రిటీలు అయినా ఇదే బాపతు.

ఇక రెండవది, స్థూలంగా చెప్పాలంటే మన యువకులలో కంటే యువ మహిళలలోనే సంప్రదాయేతరమైన కొన్ని భావనలను పరిగణలోకి తీసుకునే విశాలదృష్టి ఎక్కువగా ఉంటోంది. ఉదాహరణకు, నేను జాతీయవాద భావనను ప్రశ్నించేట్టయితే, మహిళలు తలలు ఊపే అవకాశం ఎక్కువ. నా ప్రసంగం ముగిశాక ఆగ్రహంతో ప్రశ్నలు సంధించే అవకాశం తక్కువ.

ఇక మూడవ విషయం, యువతీయువకులు ఇరువురికీ ఒకే తీరున సామాజిక న్యాయమనే భావన తెలిసి ఉండటం లేదు. ఉదాహరణకు, రిజర్వేషన్లనే తీసుకుందాం. నేను మాట్లాడిన శ్రోతలు దాదాపుగా ఎన్నడూ దళితులు, ఆదివాసుల దుస్థితి పట్ల సానుభూతితో లేరు.

శ్రోతలలో దళితులు, ఆదివాసులు దాదాపుగా ఎవరూ లేరని నిర్ధారణ అయినాక, ఆ వర్గాలవారు అక్కడ లేకపోవడానికి కారణం వ్యవస్థ వారిని అవకాశాలకు దూరం చేయడమేనని తెలిసినా వారి దృష్టి మారదు. రిజర్వేషన్ల వ్యతిరేక వ్యాఖ్యలు చేయడానికి ముందు దళితులు, ఆదివాసులు వివక్షను ఎదుర్కొంటున్నారని ఆమోదించాలని ఆశిస్తున్నానని నేను తరచుగా నా శ్రోతలకు చెప్పేవాణ్ణి. అయినా అది ఎన్నడూ జరగలేదు. రిజర్వేషన్లపై 'ప్రతిభ' విజయం సాధించాలనే ఒకే ఒక్క అంశంపైన మాత్రమే యువత ఆగ్రహంతో ఉంది.

నాలుగు, వారికి ఆందోళన కలిగిస్తున్న ఏకైక అతిపెద్ద సమస్య కాశ్మీర్ మాత్రమే. ప్రభుత్వం ఉగ్రవాదంగా పిలిచే సమస్య దేశంలోని మూడు ప్రాంతాలలో ఉన్నదని వారికి చెప్పి చూశాను. గత పదేళ్లుగా ఈ హింస అతి ఎక్కువగా జరుగుతున్నది, 6080 మంది మరణించిన నక్సలైట్ ప్రాంతంలో. ఈ హింసకు సంబంధించి రెండవ స్థానం ఈశాన్య భారతానిది. ఇదే కాలంలో అక్కడ 5,050 మంది మరణించారు.

జమ్మూ కాశ్మీర్ ప్రాంతం మూడో స్థానంలో ఉంది. అక్కడ గత పదేళ్లలో 3,378 మంది చనిపోయారు. అయినా, ఈశాన్యం లేదా నక్సలైట్ హింస గురించి ఎన్నడూ ఏ ప్రశ్నా ఎదురు కాలేదు. కానీ కాశ్మీర్ గురించి, రాళ్లు విసిరేవారి గురించి యువత బాగా ఆందోళన చెందుతోంది. ఈ ఆందోళనతోపాటు వారికి ఆర్టికల్ 370 చరిత్ర గురించి, భారత ప్రభుత్వ ప్రవర్తన గురించి ఏమాత్రం తెలిసి ఉండకపోవడమూ ఉంది. వారు విద్యార్థులు కావడం వల్ల ఇది ఆశ్చర్యకరం. మన ఛానళ్లు చూపుతున్న జాతీయత, జాతి వ్యతిరేకత అనే తెలుపు నలుపు వైఖరికే వారు అంటిపెట్టుకున్నారు. ఐదు, పైన పేర్కొన్న నా పరిశీలనలకు కొన్ని మినహాయింపులు కూడా ఉన్నాయి. అవి సాధారణంగా

సామాజిక శాస్త్రాలు, కళలు, సాహిత్యం వంటి రంగాలకు చెందినవారి నుంచి వచ్చేవే. కానీ ఇంజినీరింగ్, కామర్స్, సైన్స్ విద్యార్థులు చాలావరకు పైన పేర్కొన్న ప్రామాణిక వైఖరితో ఉండే అవకాశమే ఎక్కువ.

ఆరు, ప్రధాని నరేంద్రమోదీకి విద్యార్థులలో బాగా ఆదరణ ఉంది. ఆయన మాట్లాడేది బాగా అర్థవంతంగా ఉంటుందని అనుకుంటున్నారు. ఆయనలో కనిపించే గుణాలను వారు మెచ్చుతున్నారు. ఆయన గతం గురించిన లేదా పనితీరు గురించిన అభ్యంతరాలను విద్యార్థులు తేలికగా తోసిపుచ్చేస్తారు. ఏడు, గోవధ, గొడ్డుమాంసాల సమస్యపై కొట్టి చంపేయడాలు వారికి ఇబ్బందిగా అనిపిస్తున్నాయి. కానీ ఆ హింసకు ప్రభుత్వం బాధ్యత వహించాలని వారు భావించడం లేదు.

ఎనిమిది, వారి భవిత గురించి లేదా భారత ఉపాధి మార్కెట్ గురించి అడిగితే తప్ప వారు ఎన్నడూ మాట్లాడటం లేదు. ఉద్యోగిత గురించి జరుగుతున్న చర్చగానీ, నిరుద్యోగం అతి పెద్ద సమస్యలలో ఒకటనిగానీ వారికి తెలిసివున్నట్టు అనిపించదు. లేదంటే, వారు తమ భవితకు సంబంధించిన సమస్యలను ఎలాగోలా పరిష్కరించుకోగలమనే విశ్వాసంతో ఉండి ఉంటారు.

తొమ్మిది, వారు వేసే ప్రశ్నల నాణ్యత ప్రాథమికం, బలహీనం. మీడియా లేదా తమకు విద్య నేర్పేవారు నూరిపోసే దానికి స్వతంత్రంగా సమస్యను పరిశీలించే మంచి విద్యార్థులను మనం తయారుచేయడం లేదు. ఇక చివరిది, ఇంగ్లిష్ వాడే వారి భాషా పరిజ్ఞానం అధ్వాన్నం. ఉన్నతవిద్యా వ్యవస్థ సరైన నిపుణ, కార్యాలయ ఉద్యోగాలకు తగిన పట్టభద్రులను తయారుచేయడం లేదు. చాలామంది కాకున్నా పలువురికి ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేయడానికి అవసరమైన ప్రాథమిక సంభాషణా నైపుణ్యాలు సైతం లేవు.

– (సాక్షి సౌజన్యంతో)⊙

# ఆకార్ పటేల్ వ్యాసంపై లోక్‌సత్తా ప్రతిస్పందన


'భవిత పట్ల బెంగలేని మన యువత' పేరుతో ఆకార్ పటేల్ రాసిన వ్యాసంలోని అంశాలతో లోక్‌సత్తా పూర్తిగా ఏకీభవిస్తోంది. సమాజంలో స్పందన ఉండాల్సిన రీతిలో ఉంటే సరైన యువనాయకత్వం సమకూరి లోక్‌సత్తాఇప్పటికే అధికారంలో ఉండేది. తమ ముందుతరంకంటే స్మార్ట్‌గా ఉన్న మన యువతలో ఎక్కువమంది ఇలా పౌరసత్వ, నాయకత్వ భావన లేకుండా ఉండటానికి మన రాజకీయం, పాలన తీరే ప్రధాన కారణం. సరైన విద్యను, ఆరోగ్యాన్ని అందించకుండా, స్థానికంగా పాలన అంటే ఏమిటో తెలుసుకునేందుకు అధికార వికేంద్రీకరణ చేయకుండా యువతను, ప్రజలను కేవలం ఓటు వేసే యంత్రాలుగా మాత్రమే కొనసాగిస్తున్నారు. కేవలం 20శాతం మందికి మాత్రమే ఎదిగే అవకాశాలున్న వ్యవస్థను, వంశపారంపర్య రాజకీయాలను పెంచి పోషిస్తున్నారు. అందుకే తొలి నుంచీ లోక్‌సత్తా సరైన విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలను రాజకీయానికి కేంద్రబిందువు చేసేందుకు, అందుకు తగ్గ వ్యవస్థల నిర్మాణానికి గట్టి పోరాటం సాగిస్తోంది. ఉన్న సమాజాన్ని, రాజకీయాన్ని మార్చటానికి ఈ విధానాలతో ఆశావాదంతో పోరాడటమే చైతన్యవంతులైన పౌరుల, నాయకుల కర్తవ్యం. ప్రపంచంలో ఎక్కడ మార్పు వచ్చినా ఇదేతీరుగా వచ్చింది. లోక్‌సత్తా చెబుతున్న పరిష్కార భావాలనే ప్రముఖ అమెరికన్ ప్రజాతత్వవేత్త మైఖేల్ శాండల్ 2015లో టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వక్కాణించారు. ప్రజల్ని పౌరులుగా తయారుచేయటానికి విద్యావ్యవస్థ, మీడియా మారాలన్నారు. లోక్‌సత్తా టైమ్స్ జనవరి 1, 2016 సంచికలో ప్రచురించిన ఈ ఇంటర్వ్యూని సందర్భావసరంగా మళ్లీ అందిస్తున్నాం..

## మార్కెట్లు తమంతట తాము సమాజాన్ని మార్చలేవు, ప్రజల్ని పౌరులుగా తయారుచేయటానికి భారతదేశ విద్యావ్యవస్థ, మీడియా మారాలి

### -ప్రముఖ అమెరికన్ ప్రజా తత్వవేత్త మైఖేల్ శాండల్-

మార్కెట్లు తమంతట తాము సమాజాన్ని మార్చలేవని, భారతదేశంలో విద్య, మీడియారంగాల్లో మౌలిక మార్పులు వస్తేనే జనం జీవితాలు మెరుగుపడతాయని సుప్రసిద్ధ అమెరికన్ రాజకీయ తత్వవేత్త, హార్వర్డ్ యూనివర్సిటీ ఆచార్యుడు మైఖేల్ శాండల్ అన్నారు. ఇటీవల (2015 ఉత్తరార్థంలో) ముంబయిలో టైమ్స్ ఆఫ్ ఇండియా కార్యక్రమంలో పాల్గొన్న శాండల్.. జీవేష్ మోహన్‌కిచ్చిన ఇంటర్వ్యూలో భారతదేశం ఏమాత్రం ఆలస్యం చేయకుండా గుర్తించాల్సిన కొన్ని లోతైన పరిశీలనల్ని అందించారు:

**టైమ్స్ ఆఫ్ ఇండియా: 'న్యాయం' (జస్టిస్)పై మీ ఆన్‌లైన్**




**కోర్సుని ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది చూస్తుంటారు. అందరికీ విద్యను అందించటంలో ఇంటర్‌నెట్ పాత్రపై మీ అభిప్రాయం?**

**శాండల్:** ఉన్నత విద్యావకాశాల్ని అందించటంలో ఆన్‌లైన్ బోధన ముఖ్యమైన అవకాశం. న్యాయంపై శిక్షణా తరగతుల ద్వారా ఈ ప్రయోగాన్ని చేశాం. పూర్తి ఫలితాల్ని చూడాలి.

తాత్విక విషయాలపై ప్రసంగాలను చూడటానికి ప్రపంచవ్యాప్తంగా అన్ని లక్షలమంది ఎదురుచూస్తుంటారని నేను కలలో కూడా ఊహించలేదు. స్పందన చాలా ఆశ్చర్యం కలిగించింది.



ఉన్నత విద్య ప్రైవేటు సొత్తుగా కాకుండా ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా చేయటంలో ఇంటర్‌నెట్ గొప్ప సాధనంగా ఉపయోగపడుతుంది.

**మార్కెట్ల నైతిక పరిమితుల గురించి మీరు చెబుతుంటారు. అవయవ దానం వంటి విషయాల్లో. మార్కెట్లు స్వీయ విలువలతో సమాజంలో నైతికతను పెంపొందించలేవా?**

మార్కెట్లు వాటంతటవి ఆ పని చేయలేవు.

సమాజంలో సంపదని, అభివృద్ధిని పెంచటానికి మార్కెట్లు గొప్ప ఉపకరణాలు. కానీ న్యాయబద్ధ సమాజాన్ని వాటంతటవే నిర్మించలేవు.

ఆర్థిక శక్తులు సామాజిక జీవనాన్ని శాసించకుండా, ప్రజలు కేవలం వినియోగదారులుగా కాకుండా పౌరులుగా వ్యవహరించేలా చేయటానికి.. మార్కెట్లను ప్రజాస్వామిక వ్యవస్థల పరిధిలో ఉంచాలి. ప్రజల్ని పౌరులుగా తయారుచేయటం నాణ్యమైన విద్య, హేతుబద్ధ చర్చలకు అవకాశం కల్పించే మీడియా ద్వారా మాత్రమే సాధ్యం.

**నిర్మాణాత్మక బహిరంగ చర్చ ప్రజాస్వామ్యానికి మూలం అంటున్నారు. కానీ రాజకీయ నాయకులు కులం, మతం, ప్రాంతం వంటి ఓటుబ్యాంకులను తయారుచేసే భారతదేశంలో మంచి ప్రమాణాల బహిరంగ చర్చకు ప్రజల్ని ఎలా సన్నద్ధుల్ని చేయగలం?**

ప్రజల్ని నిజమైన ప్రజాస్వామ్యానికి సన్నద్ధం చేయటంలో చదువు, మీడియా చాలా ముఖ్య పాత్ర పోషిస్తాయి.

యువతీయువకులను సత్తా గల పౌరులుగా తయారుచేసేలా విద్యావ్యవస్థ ఉండాలి. ఇందుకోసం చరిత్ర, రాజకీయాలు, ప్రజాస్వామ్యం వంటి పాఠాలను బోధించటంతో పాటు హుందాతనం, పరస్పర గౌరవంతో కూడిన సంభాషణ, చర్చ వంటి అలవాట్లను పెంపొందించాలి.

రెండోది, మీడియా ఒకరి మీద ఒకరు అరుచుకునే కుస్తీ పోటీల్లాంటి చర్చలు చేయకుండా హేతుబద్ధ చర్చలకు వేదికగా ఉండాలి. ప్రస్తుతం భారతదేశ మీడియా అంత గొప్పగా ఉందని నేననుకోవటం లేదు.

కాబట్టి ప్రజల్ని నిర్మాణాత్మక బహిరంగ చర్చలకు సిద్ధం చేసే బాధ్యతను నెరవేర్చటానికి భారతదేశంలో విద్యావ్యవస్థ, మీడియా సమూల మార్పులతో సిద్ధమవ్వాలని భావిస్తున్నాను.

**అర్థ బలం, కుటుంబ, వంశపారంపర్య రాజకీయాల ద్వారా అధికారంలోకి వస్తున్నవారి గురించి మీరు చెబుతుంటారు. ఇవి రెండూ భారతదేశానికి కూడా పెనుసవాలుగా తయారయ్యాయి. ఇందుకు సంబంధించి?**

అవును, అవి రెండూ ప్రమాదాలే. జవాబుదారీతనంలేని ఆ రెండు రకాల అధికారానికీ ప్రత్యామ్నాయాలు కనుగొనాలి.

అధికారంలోకి రావటమనేది.. డబ్బు, మీ తల్లిదండ్రులెవరు అనే వాటి మీద ఆధారపడి ఉండటానికి వీల్లేదు.

**ఈవేళ్టి భారతదేశం ఎలా ఉందనుకుంటున్నారు? మెరుగైన ప్రజాస్వామ్యం కావటానికి మేము ఏం చేయాలి?**

నేను భారత్‌కి రావటం ఇది ఐదోసారో, ఆరోసారో. ఇక్కడి సమాజంలోని ఉత్సాహం, కలుపుగోలుతనం, చైతన్యపూరిత వాతావరణం నాకు అచ్చెరువు గొలుపుతుంటాయి. ఇక్కడి ప్రజల్లోని అంతర్గత ప్రజాస్వామ్య స్ఫూర్తి చాలా శక్తిమంతమైంది. ఇవన్నీ చూశాక భారత్ సవాళ్లని అధిగమిస్తుందనే విశ్వాసం, ఈ దేశ భవిష్యత్తు పట్ల గొప్ప ఆశ నాకు కలిగాయి.

భిన్న వర్గాల, సంస్కృతుల ప్రజల మధ్య పౌరసత్వ భావనను, భారతదేశం అనే దృక్పథాన్ని నిర్మించటం ఇప్పుడు ఒక భారతీయ బహుళత్వ సమాజం ముందున్న ముందున్న పెద్ద సవాలు. వీటితోపాటుగా పేదరికం, అవినీతి కూడా భారత్‌కు పెద్ద అవరోధాలుగా కొనసాగుతున్నాయి.

ఈ సవాళ్లను అధిగమించి భారతదేశం బలమైన ప్రజాస్వామ్యంగా కూడా తయారై మిగిలిన ప్రపంచానికి ఓ ఆదర్శంగా నిలుస్తుందని నాకు నమ్మకముంది. ⊙

# ప్రాంతీయమండళ్లతోనే ఉత్తరాంధ్ర, రాయలసీమల వృద్ధి




ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపుతూ ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్రాంతీయమండళ్లను ఏర్పాటు చేసి నిధుల్ని కేటాయించాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలకు, సీమలోని నాలుగు జిల్లాలకు ప్రత్యేక మండళ్లను ఏర్పాటు చేసి బడ్జెట్‌లో కొంత మొత్తాన్ని కేటాయిస్తే ప్రజలకు అపోహలు, ప్రభుత్వాలపై కోపాలు ఉండవన్నారు. శ్రీకాకుళంలో మీడియాతో మాట్లాడుతూ.. చట్టబద్ధమైన అధికారం, వనరులు సమకూర్చి, తప్పులు జరిగితే కఠినంగా శిక్షించాలని జేపీ అన్నారు. ఎక్కడ అవినీతి జరిగినా పదవులు తీసే ఏర్పాటు ఉండాలన్నారు. గ్రామాలు బాగుపడితే పట్టణాలు, రాష్ట్రం బాగుపడుతుందన్నారు. స్థానిక మండళ్లను ఏర్పాటు చేసి వనరులు కేటాయించి పర్యవేక్షించాలన్నారు. విద్యలో సమూల మార్పులను సూచిస్తూ ప్రభుత్వానికి లోక్‌సత్తా, ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) తరపున ఒక నమూనాను పంపామన్నారు. సమగ్రంగా ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని అందుబాటులోకి తేవాలని, ఇందుకోసం కూడా ఒక నమూనాను అందించామన్నారు. మారుమూల గ్రామాల ప్రజలకు సరైన విద్య, వైద్య సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వాసుపత్రులను బలోపేతం చేయాలని సూచించారు. పోలవరం పూర్తయితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, లెఫ్ట్ కాలువను కూడా పొడిగించి మహానదిని గోదావరితో అనుసంధానం చేయాలన్నారు. ఆరోగ్యశ్రీకి కేటాయిస్తున్న నిధుల్ని మరో 2,000కోట్లు పెంచితే గ్రామీణ ప్రాంతాలకు కూడా మంచి వైద్యం అందించవచ్చన్నారు. లోక్‌సత్తాకు పట్టణాల్లో 10శాతం, గ్రామాల్లో 1శాతం ఓటర్లు ఉన్నారని, పార్టీలకు అతీతంగా లోక్‌సత్తా ఒక రాజకీయ ఉద్యమంలా పనిచేస్తోందని తెలిపారు. తాము ఎటువంటి రాజకీయం కోరుతున్నామో అందుకు ప్రస్తుతం అవకాశం లేదని, అందుకే ఉద్యమరూపంలో తమ వంతు ప్రయత్నం మార్పు కోసం చేస్తున్నామన్నారు. లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, లోక్‌సత్తా 2.0 ఉద్యమ తెలంగాణ, ఏపీ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ నాయకులు పంచాది రాంబాబు, కె.పోలినాయుడు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ⊙

# గ్రంథాలయాల బూజు దులుపుతున్న నరసింహ, షీలూ రాజ్

**"ఆలోచన, అంకితభావం గల కొద్దిమంది పౌరులు మార్పు తేగలరా? అని సందేహించొద్దు. నిజానికి చాలా మార్పులు వచ్చిందే ఆ రకంగా"**

**- మార్గరెట్ మీడ్**





**డి. నరసింహ**

దొంతినేని నరసింహ ప్రస్తుతం ఐఐఎం రోహ్‌తక్‌లో ఎంబీయే చేస్తున్నారు. 2016 ఫిబ్రవరిలో 24 ఏళ్ల వయసులో గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో లోక్‌సత్తా పార్టీ తరపున పోటీ చేశారు. అంతకుముందు నగరంలో మెరుగైన ప్రజారవాణా వ్యవస్థ, విద్యార్థులకు సరైన బస్సు సౌకర్యాలు, సిటీ బస్సులు-ఎంఎంటీఎస్-ఇతర ప్రజారవాణా సౌకర్యాలన్నిటికీ ఒకే టికెట్ వంటి అంశాల కోసం పోరాడి కొన్ని సాధించారు. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ మార్గదర్శకత్వంలో ప్రారంభమైన 'యూత్ ఫర్ బెటర్ ఇండియా' (వైబీఐ) వ్యవస్థాపక సభ్యులలో నరసింహ ఒకరు. అవినీతికి వ్యతిరేకంగా దాదాపు లక్షమంది యువతను వైబీఐలో భాగస్వాముల్ని చేయటంలో నరసింహ కృషి ఎంతో ఉంది. ఈ క్రమంలోనే ఆధునిక ప్రజాస్వామ్యంలో పౌరసత్వం, నాయకత్వం విలువను అర్థం చేసుకుని.. ఓటు, భావప్రకటనా స్వేచ్ఛ, సంఘాలుగా ఏర్పడే అవకాశం వంటి నాగరిక పద్ధతుల్లో పోరాటాలు చేసే పరిణతి అలవడింది. ఈ రకంగానే ఇటీవల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రజా గ్రంథాలయాలను మెరుగుపరిచే కృషికి నాంది పలికారు. గ్రంథాలయాల పేరుతో సుంకంగా వసూలు చేసిన డబ్బు దాదాపు రూ.400 కోట్లు ఉన్నా నగరంలోని ప్రజా లైబ్రరీలన్నీ అధ్వాన్నంగా ఉన్నాయని 2016 ప్రారంభంలో ఒక మహిళ నరసింహకు చెప్పారు. మార్పు తేవటం కోసం ఏదైనా చేయాలని సూచించారు. అయితే వ్యక్తిగత జీవితం హడావుడిలో ఆ విషయం తాత్కాలికంగా మరుగున పడింది.

ఆ తర్వాత నరసింహ మిత్రుడొకరు గ్రంథాలయాల సెస్సు ఎంత పోగుపడిందో లెక్కచెబుతూ, లైబ్రరీల దుస్థితిపై ఒక వ్యాసాన్ని షేర్ చేశారు. దీంతో ఆ మహిళ చెప్పిన విషయం గుర్తుకొచ్చింది. ఏదో ఒకటి చేయాలని షీలూ రాజ్, శివ, రవి, రాజీవ్, రాఘవేంద్ర తదితర స్నేహితులతో కూర్చున్నారు.

హైదరాబాద్ సిటీ సెంట్రల్ లైబ్రరీని సందర్శించి మొత్తం వివరాలు కూపీలాగారు. వందల కోట్లు సెస్సు ఉన్నా.. లైబ్రరీలోని కుర్చీలు, మొబైల్ లైబ్రరీ ఎలా మూలపడ్డాయో, టాయిలెట్లు ఎంత దుర్గంధం వెదజల్లుతున్నాయో, సిబ్బంది ఎలా



- 8 - - 75/A

GOVERNMENT OF TELANGANA
DEPARTMENT OF PUBLIC LIBRARIES
PARTICULARS OF LIBRARY CESS DUES FROM MUNICIPALITIES AND GRAMPANCHAYATS IN 10 DISTRICTS IN TELANGANA STATE

| No. | Name of the District | Total Cess dues up to 29-02-2016 (Rupees in Crores) |
|---|---|---|
| 1 | Adilabad | 4.01 |
| 2 | Hyderabad (up to 2013-14) | 301.70 |
| 3 | Karimnagar | 4.87 |
| 4 | Khammam | 4.09 |
| 5 | Medak | 3.78 |
| 6 | Mahabubnagar | 0.40 |
| 7 | Nalgonda | 8.56 |
| 8 | Nizamabad | 7.39 |
| 9 | Ranga Reddy | 40.15 |
| 10 | Warangal | 5.75 |

Sd/-
DIRECTOR OF PUBLIC LIBRARIES

ఇష్టమొచ్చినట్టు వస్తున్నారో కొందరు ఉద్యోగులు, సందర్శకులు వివరించారు. స్థలం విశాలంగా ఉంది కాబట్టి చెట్ల కిందయినా కూర్చుని చదువుకునే అవకాశం లభించింది తప్ప, ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదని వారు చెప్పారు. ఈలోగా సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కూడా వచ్చాయి. 2006 నుంచి 2013







జేపీతో షీలూ రాజ్

వరకు నగర ప్రజలు రూ.339.87 కోట్లు లైబ్రరీ సెస్సు కింద జీహెచ్ఎంసీకి కడితే, అందులో కేవలం రూ.39కోట్లనే నగర గ్రంథాలయ సంస్థకు ఇచ్చారు. నరసింహ మిత్రులు అనేకమంది లైబ్రరీల్లో చదువుకోవటానికి అవకాశాలు లేక.. నెలకు రూ.2000 వరకు స్టడీ రెంట్ చెల్లించి మరీ నగరంలో అద్దె గదుల్లో వివిధ పరీక్షలకు ప్రిపేరవుతున్నారు. అంటే, ఒక పక్క సెస్సు బాదుడు, మరో పక్క అద్దె బాదుడు.

ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు, పాలకులు స్పందించకపోవటంతో.. చివరకు షీలూ రాజ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. సెస్సు ద్వారా వసూలు చేసిన సొమ్మును వెంటనే విడుదల చేస్తామనాల్సింది పోయి, సెస్సును బాగా తగ్గిస్తామని, 'పిల్'ను అనుమతించవద్దని కోర్టుకవద్ద జీహెచ్ఎంసీ వాదించింది. కానీ హైకోర్టు చీవాట్లు పెట్టి మరీ వ్యాజ్యాన్ని అనుమతించింది. వసూలు చేసిన పన్నును విడుదల చేయాలన్న బాధ్యతకు, కొత్త ప్రతిపాదనకు సంబంధం లేదని స్పష్టంచేసింది. ప్రజలకు న్యాయం జరగటానికి నరసింహ వేసిన 'పిల్'ను అనుమతించాలని, తెలంగాణ ప్రభుత్వ ప్రజా గ్రంథాలయ, విద్యా విభాగం కూడా న్యాయస్థానాన్ని కోరింది. జేపీని కలిసి నరసింహ, షీలూ రాజ్ వివరాలు అందచేసినప్పుడు.. ఆయన కూడా ప్రోత్సహించారు. ఈ పరిణామాలకు తోడు తెలంగాణలోని వివిధ రంగాల పౌరప్రముఖులు కూడా గళం పెంచటంతో.. తెలంగాణ ప్రభుత్వంలోని పెద్దలలో కదలిక వచ్చింది. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్‌ని, జిల్లా గ్రంథాలయ సంస్థ కమిటీను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. డిసెంబర్ 13, 2016న తెలంగాణ గ్రంథాలయ పరిషత్ సమావేశం జరిగి, పుస్తకాల కొనుగోలు కార్యక్రమం మొదలైంది. రాష్ట్రంలోని గ్రంథాలయాలన్నిటినీ ఆధునీకరిస్తామని మంత్రులు కడియం శ్రీహరి, కె. తారకరామరావు ప్రకటించారు. గ్రంథాలయ ఉద్యోగుల జీతాలను నేరుగా ట్రెజరీ నుంచి ఇస్తామని, మెరుగ్గా పనిచేసేందుకు వసతులు కల్పిస్తామని చెప్పారు.

ఆ తర్వాత రాష్ట్ర, జిల్లా గ్రంథాలయ కమిటీలను ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ కూడా తాను పక్కదోవ పట్టించిన గ్రంథాలయ నిధులను విడుదల చేయటం ప్రారంభించింది (రూ.3,17,70,000 చెక్కును ఫోటోలో చూడవచ్చు). ఈ కేటాయింపులను ఆడిట్ కూడా చేయించాలని షీలూ రాజ్ కోరుతున్నారు. అలాగే లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ విభాగం కూడా రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు వేణుగోపాల్ నేతృత్వంలో ఈ కేసులో ఇంప్లీడ్ అయి ఏపీలో కూడా గ్రంథాలయాలను ప్రక్షాళన చేసేందుకు నడుం బిగించారు.

ప్రస్తుత హామీలు, చర్యలతోనే గ్రంథాలయాలు మారిపోవు. ఈ ఉద్యమాన్ని సాకారం చేయటానికి, మారిన యువ భారత్‌కి అనుగుణంగా లైబ్రరీలను తీర్చిదిద్దటానికి, పుస్తకాన్ని ప్రతి వ్యక్తి నిత్యజీవితంలో భాగం చేయటానికి ఇంకా చాలా చేయాల్సుందని నరసింహ, షీలూ రాజ్ అంటున్నారు. స్థానిక యువత భాగస్వామ్యంతో, ఆలోచనాపరుల సహకారంతో విజయం సాధిస్తామనే నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు.

"కొందరు పాలకుల హయాంలో మార్పు ఆలస్యం కావచ్చు. కానీ చైతన్యవంతమైన పౌరసత్వాన్ని ఆపే శక్తి ఎవరికీ

ఉండదు. కొంత ఓపిగ్గా కృషి చేస్తే కచ్చితంగా విజయం సాధిస్తాం. ఇతరత్రా ఎన్ని అంశాలపై కార్యక్రమాలు తీసుకున్నా.. ప్రజాగ్రంథాలయాలను విస్తరించటం మీద నిరంతరం శ్రద్ధ చూపుతుంటాం" అంటున్న నరసింహకు, షీలూ రాజ్, ఇతర యువ మిత్రులకు ఆల్ ది బెస్ట్ చెబుతూ మనవంతు తోడ్పాటునిద్దాం. ⊙

## 2019 'ప్రపంచ పుస్తక రాజధాని' షార్జా

యునెస్కో 2019 సంవత్సరానికిగానూ ప్రపంచ పుస్తక రాజధానిగా యూఏఈలోని షార్జాను ప్రకటించింది. అక్షరాస్యత నాణ్యత, సాంస్కృతిక కార్యకలాపాలు, పుస్తకాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు నగరం చేపట్టిన చర్యలను గుర్తించి ఈ ప్రతిష్టాత్మక గౌరవాన్ని కల్పించింది.


## విస్తరిస్తున్న 'హ్యూమన్ లైబ్రరీలు'

మా అబ్బాయి పుస్తకాలు చదవటాన్ని ఆస్వాదించటం చూశాక నాకు భరోసా ఏర్పడింది. ఎటువంటి సమస్యనైనా వాడు తనంతతాను పరిష్కరించుకోగలడన్న నిశ్చింత కలిగింది" అని ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ ఓ ఇంటర్వ్యూలో అన్నారు. పుస్తకం అంతటి ప్రభావశీలి కాబట్టే.. ప్రపంచంలోని గొప్ప నాయకులందరిలోనూ పుస్తకాలు చదివే, రాసే అలవాటు కనిపిస్తుంది. ఎప్పటికప్పుడు పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ సృజనాత్మకతను జోడిస్తూ వీరు నాయకులుగా ఇంకా ఇంకా ఎదుగుతుంటారు. జ్ఞానాన్ని పెంచుకోవటం కోసం పుస్తకాలను చదవటంతోపాటు అనుభవజ్ఞులను, వృద్ధులను కూడా కలుసుకునే అలవాటు కూడా పలువురు ఉత్తమ నాయకులకు ఉంటుంది. విషయాన్ని పుస్తకం ద్వారా తెలుసుకోవటం ఒక పద్ధతయితే, అనుభవసారమున్న మనుషుల ద్వారా తెలుసుకోవటం మరో పద్ధతన్నమాట. ఈ మరో పద్ధతిలోనే హ్యూమన్ లైబ్రరీలను అభివృద్ధి చేస్తున్నారు. డెన్మార్క్‌లో 16 ఏళ్ల క్రితం ప్రారంభమైన మానవ గ్రంథాలయాలు ఈమధ్య మనదేశంలో కూడా ఏర్పడ్డాయి. ముంబయి, ఇండోర్, హైదరాబాద్‌లో ఇవి పనిచేస్తున్నాయి. ఇలా కథలు, నచ్చిన అంశాలను వివరించడానికి వచ్చే వారిని 'బుక్స్'గా అభివర్ణిస్తారు. ఢిల్లీ తదితర చోట్ల మానవ బుక్స్ దగ్గరకు వెళ్లి నచ్చిన అంశాన్ని వినేందుకు సెలవు దినాల్లో పఠన కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారు. కథ చెప్పేవారి పేర్లు మనకు తెలియదు. పుస్తకాన్ని శీర్షికతో ఎలా పేర్కొంటామో, అలా కథ చెప్పే వారినీ శీర్షికతో పరిచయం చేస్తారు. పేరును బట్టి వెళ్లి.. ఆ వ్యక్తి చక్కని మాటలతో, హృద్యంగా, అత్యంత సానుకూల వైఖరితో చెప్పే కథను ఆలకించవచ్చు. సందేహాలుంటే నివృత్తి చేసుకోవచ్చు. 'మానవ పుస్తకం' అనుభవసారాన్ని స్ఫూర్తిమంతంగా తీసుకోవచ్చు. తమ కృషి ఇంకా విస్తరించేందుకు, సమాజాన్ని చైతన్యపరిచేందుకు పౌర సమాజం సహకరించాలని మానవ గ్రంథాలయ డిపో మేనేజర్లు అంటున్నారు.

## ఎన్‌బీటీ 60 ఏళ్ల పండుగ

శాస్త్రీయ దృక్పథం, పరిశోధనల పట్ల అమితాసక్తిని ప్రదర్శించిన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చొరవతో 1957లో మౌలానా ఆజాద్ నేతృత్వంలో నేషనల్ బుక్ ట్రస్ట్ స్థాపితమైంది. ఎన్‌బీటీ ఏర్పాటు చేసేనాటికి భారత్‌లో అక్షరాస్యత 25శాతం లోపే. అయినప్పటికీ ప్రజలలో పుస్తక పఠనాసక్తిని కలిగించటంలో ఎన్‌బీటీ ఎన్నదగిన విజయమే సాధించింది. చదివే అలవాటును పెంచటంతోపాటు పుస్తక రచనను, ప్రచురణను, కవులు, రచయితలు, అనువాదకులను ప్రోత్సహించటం ఎన్‌బీటీ ప్రధాన బాధ్యత. సామాజిక, వైజ్ఞానిక, సాంకేతిక, సాహిత్య విషయాలకు సంబంధించి విలువైన పుస్తకాలను ట్రస్ట్ వివిధ భాషలలో ప్రచురిస్తుంది. ఇలా ఇప్పటివరకు ఇంగ్లిష్, ఈశాన్య రాష్ట్రాల భాషలతో సహా పలు భాషల్లో సుమారు 21వేల పుస్తకాలను ప్రచురించింది. భారత స్వాతంత్ర్య ఉద్యమం, సమరయోధులు, భారత రాజ్యాంగం, పార్లమెంట్, ప్రజాస్వామ్యం, పంచాయతీరాజ్ వ్యవస్థ, నైరుతీ రుతుపవనాలు, దేశ జనాభా, ప్రకృతి సంపదలు, రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ, వివిధ రంగాల ప్రముఖులు ఎన్‌బీటీ ప్రచురణల్లో ప్రాధాన్యం పొందారు. ఒక భారతీయ భాషా సాహిత్యాన్ని ఇతర భారతీయ భాషల్లోకి అనువదించి ప్రచురించటం ద్వారా ఎన్‌బీటీ వివిధ రాష్ట్రాల, ప్రాంతాల మధ్య సదవగాహనకు, భావ సమైక్యతకు, జాతీయ సమైక్యతకు కృషి చేస్తోంది. ⊙

# ది విలేజ్ లైబ్రరీ ప్రాజెక్టు
















ఏమి ఆలోచించాలో కాదు, ఎలా ఆలోచించాలో నేర్పించే విద్యావ్యవస్థ ప్రతి బిడ్డకూ అందుబాటులో ఉంటే.. ఇక ఆ దేశానికి ఢోకా ఉండదు. అవగాహన గల క్రియాశీల పౌరులకంటే ఓ దేశ భవిష్యత్తుకు అత్యుత్తమ గ్యారంటీ ఏముంటుంది? అందరికీ నాణ్యమైన విద్యను అందించటాన్ని రాజకీయానికి కేంద్రబిందువు చేయటానికి పోరాడుతున్న లోక్‌సత్తా పట్ల అభిమానాన్ని తన వంతు ఆచరణగా మార్చుకుని మారంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి అనే యువకుడు 'ది విలేజ్ లైబ్రరీ ప్రాజెక్టు'ను ప్రారంభించారు. రాయలసీమ నుంచి మొదలుపెట్టి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో వీలైనన్ని ఎక్కువ గ్రామాలలో ఈ ప్రాజెక్టు ద్వారా గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నారు. విద్య పట్ల ఆసక్తిని పెంపొందించటం, మెరుగైన విద్యను అందించటం వీటి లక్ష్యం. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, బాలల హక్కుల కోసం పోరాటాలు చేస్తున్న నోబెల్ విజేత కైలాష్ సత్యార్థి వంటి ప్రముఖులు ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహించారు. స్థానిక పెద్దలు కొందరు అండగా నిలిచారు. జేపీ స్వయంగా ఒక గ్రంథాలయ ప్రారంభోత్సవంలో పాల్గని వెన్నుతట్టారు. విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తమకు వీలున్నంత మేర పుస్తకాలను సేకరించి గ్రామ గ్రంథాలయ ప్రాజెక్టుకు పంపుతుంటారు. అవినీతిపై వ్యవస్థీకృత పోరాటానికి 2009లో 'పీపుల్ అగనెస్ట్ కరప్షన్' (పీఏసీ) సంస్థను శ్రీకాంత్‌రెడ్డి స్థాపించారు. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం డిసెంబర్ 9న కార్యక్రమంతో పీఏసీ మొదలైంది. ది విలేజ్ లైబ్రరీ ప్రాజెక్టు కంటే ముందు.. అవినీతికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ పీఏసీ పలు కార్యక్రమాలను నిర్వహించింది. అవినీతి లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలున్న సమాజ నిర్మాణం తమ లక్ష్యమని.. అందుకే పీఏసీ కార్యక్రమాలను అవినీతి నిరోధక వ్యవస్థల ఏర్పాటుతోపాటు సమగ్ర దృష్టితో గ్రామీణ విద్య కోసం గ్రంథాలయాలు వంటి అంశాలకు కూడా విస్తరించామని శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించటం కూడా చేస్తున్నామన్నారు.

తాజాగా 'పీపుల్స్ పార్లమెంట్' పేరుతో ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, నిష్ణాతులతో చర్చా కార్యక్రమాలను కూడా ప్రారంభించామన్నారు. వ్యవసాయం, ప్రభుత్వ కార్యాలయాల్లో 'పౌర సేవల చట్టం' ఎజెండాతో తొలి పీపుల్స్ పార్లమెంట్ ప్రజాప్రతినిధులు, ప్రముఖులతో ఈ ఏడాది సెప్టెంబర్‌లో కడపలో జరగనుందని, పాల్గొనాలనుకున్నవారు వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ⊙

# జనసమీకరణ కేంద్రాలు గ్రంథాలయాలు

## (తెలంగాణ నూతన వికాసం - గ్రంథాలయోద్యమం)

- డాక్టర్ కె. శ్రీనివాస్

**తె**లంగాణ నూతన సాహిత్య సాంస్కృతిక వికాసానికి నాంది పలుకుతూ ఇరవయ్యో శతాబ్దం తొలి నాలుగు దశాబ్దాలలో గ్రంథాలయం ఒక ప్రత్యామ్నాయ అధికార కేంద్రం, లేదా ప్రజా సమీకరణ కేంద్రంగా వ్యవహరించిందనడానికి అనేక ఉదాహరణలు కనిపిస్తాయి. అది విడిగా పనిచేసిన ఒక ప్రత్యేక వ్యవస్థ కాదు. అది బయటి ప్రపంచంతో గ్రామాలను, పట్టణాలను అనుసంధానం చేసిన స్థలం. అది గ్రామ చావడి, రచ్చబండ వంటి సాంప్రదాయిక సమావేశ స్థలం కాదు. అక్కడ ఫ్యూడల్ అంతరాలు బలంగా పనిచేయవు. సమష్టి భావాన్ని కలిగించే స్థలం. గ్రంథాలయం ఒక సమావేశ స్థలం కూడా. అక్కడ సభలు జరుగుతాయి. బయటివారు, తెలిసిన వారు వచ్చినప్పుడు అక్కడి వేదికనుంచే వారు గ్రామస్థులను సంబోధిస్తారు. మాదిరాజు రామకోటీశ్వం రావు వరంగల్ రాజరాజేంద్ర ఆంధ్ర భాషా నిలయం గురించి చెబుతూ "సభలకు సమావేశములకు నిషేధమున్న రోజులలో ంయా భాషానిలయమే మాకు శరణాలయముగా నుండెడిది. విద్యా నైతిక రాజకీయ విషయములు ఏదో పేరుతో చర్చింపబడుచుండెడిది. ఈ భాషా నిలయమున పండితో పన్యాసములు, కవిగానములు, అష్టావధాన శతావధానములు, జయంత్యుత్సవములు జరుపబడుచుండెడివి. మొత్తము మీద సర్వ విధముల ప్రజాహిత కార్యములలో ఈ మందిరము సహాయకారి యగుచున్నది" (స్వీయ చరిత్ర- అభ్యుదయ తెలంగాణ చరిత్రాంశములు, 1960:227) అని పేర్కొన్నారు. స్టేట్ కాంగ్రెస్ ఆవిర్భావానికి (1938) ముందున్న కథాకాలంలో 'ప్రజల



మనిషి' నవలను రచించిన వట్టికోట ఆళ్వారుస్వామి కథనంలో గ్రంథాలయం ఇలా ఉన్నది.

"కంఠీరవం, మోహనాచార్యులు గ్రంథాలయానికి వెళ్లగానే మోహనాచార్యులు ఒక పత్రికను చేతబట్టి చూడసాగాడు. "మీకు కావలసిన పత్రికేదైనా తీసికొని చదువండి" కంఠీరవం అన్నాడు. కంఠీరవానికి ఆ ప్రదేశం కన్నుల కింపుగా తోచింది. అల్మారాలలో అందంగా పేర్చబడియున్న పుస్తకాలు. అంతా నిశ్శబ్దంగా కూర్చొని చదువుతూ ఉన్న చదువరులు. అప్పుడే గ్రంథాలయంలోకి ప్రవేశించి ఒకరినొకరు మందహాసంతో నమస్కరించుకోవడం కంఠీరవానికి ఆనందంగా తోచింది. అవన్నీ గమనిస్తూ కంఠీరవం కొంతసేపు కాలం గడిపాడు.

గ్రంథాలయం ఆవరణలో నాలుగు వైపుల గోడలకు తగిలించి ఉన్న ఫోటోలను ఒక్కొక్కటి చూస్తూ ఆ ఆవరణమంతా తిరిగాడు. గాంధీ, గోఖలే, తిలక్, మోతీలాల్, లజపతిరాయ్, జవహర్‌లాల్, సరోజినీదేవి, విఠల్‌భాయి పటేల్, డా॥ అన్సారి, కమలానెహ్రూ, స్వరూపరాణి నెహ్రూ, కమలాదేవి ఛటోపాధ్యాయ, సుభాష్ చంద్రబోస్ చిత్రాలన్నీ తగిలించబడి ఉన్నాయి. ఆ పటాలలో అచ్చైన పేర్లన్నీ ఇంగ్లీషు భాషలో ఉన్నందువల్ల వారంతా ఎవరో కంఠీరవానికి అర్థం కాలేదు. అన్ని పటాల కంటె పెద్దగా ఉండి, ప్రధానమైన స్థలంలో ఉన్న నిజాం పటమును మాత్రము కంఠీరవం గుర్తుపట్టాడు. వరుసగా బల్లలు, వాటికి రెండు వైపుల కుర్చీలు, బల్లలపై దిన, వార, పక్ష మాస పత్రికలు పెట్టబడి ఉన్నాయి." (వట్టికోట ఆళ్వారుస్వామి, ప్రజల మనిషి, 1970:63) ఆళ్వారుస్వామి చేసిన గ్రంథాలయ వర్ణనను ఆధారం చేసుకుని నాటి ఆంధ్రోద్యమ దశను, పరిమితిని, అవగాహనను, అవసరాలను అన్నిటినీ అర్థం చేసుకోవచ్చు.

'ప్రజల మనిషి' నవలలోని ప్రధాన పాత్ర కంఠీరవం. అతను కాంగ్రెసు రాజకీయ కార్యకర్తగా మారడంతో నవల ముగుస్తుంది. 'కంఠీరవం రాజకీయ జీవితం నిజామాబాదులో గ్రంథాలయా నికి వెళ్లి పుస్తకాలు చదవడంతో ప్రారంభమైంది. అదే అతనికి జాతీయోద్యమాన్ని పరిచయం చేసింది. క్రమంగా అతడు నిజామాబాదు స్థానిక ప్రజాజీవితంలో ప్రధాన కార్యకర్తగా పరిణతి చెందాడు. నిజామాబాదులో గ్రంథాలయ మహాసభలు జరపాలని కంఠీరవం చేసిన ప్రయత్నం ఒక రాజకీయ మహాసభను చేయడానికి పడిన ప్రయాసను మించిపోయింది.

గ్రామాలలో గడీకి గ్రంథాలయం ఒక ప్రత్యామ్నాయ కేంద్రంగా ఎలా రూపొందిందో ప్రజల మనిషి నవలే చెబుతుంది. "కొమురయ్య భూమి సమస్యపై దొరతో ఘర్షణపడిన విజయదేవు తన ఉనికి గడీ కాదు, గ్రంథాలయమని గ్రహించాడు. జైలు నుంచి విడుదలై వచ్చిన కంఠీరవం తల్లిని, వదినెను పలకరించడానికి మాత్రమే ఇంటికి పోయాడు కాని దొర ఏజెంటుగా

వ్యవహరిస్తున్న వెంకటాచారి ఇల్లు కాదు, ప్రజా చైతన్య కేంద్రమయిన గ్రంథాలయమే తన ఇల్లని ఎంచుకున్నాడు. గడీ ప్రజా శత్రువుల సమావేశ స్థలమైతే, గ్రంథాలయం ప్రజల సమావేశ స్థలమయింది. అమీను, మేజిస్ట్రేటు, పోలీసులు, హైదరలీ, వెంకటాద్రి, వెంకటాచారి సరాసరి గడీకి వస్తే ప్రజామిత్రులు వరంధామయ్య, విజయదేవు, కొమురయ్య, చంద్రయ్య, కంఠీరవం, బషీర్, వెంకటేశ్వరరావులు గ్రంథాలయానికి వస్తారు. వాళ్ళ మంతనాలు, కుట్రలు అక్కడ సాగితే వీళ్ల చర్చలు, ఆలోచనలు ఇక్కడ సాగాయి" (తెలంగాణ విమోచనోద్యమము తెలుగు నవల– సమాజ సాహిత్య సంబంధాలు– ఒక విశ్లేషణ, 1983: 64,67) అని 'ప్రజల మనిషి'లోని గ్రంథాల యోద్యమాన్ని విశ్లేషిస్తూ వరవరరావు వ్యాఖ్యానించారు.

ఆంధ్రోద్యమం మలిదశలో ఉద్యమం స్పష్టమైన రాజకీయ ఉద్దేశాలను వ్యక్తం చేస్తున్న క్రమంలో మాత్రమే గ్రంథాలయాలు అటువంటి ప్రత్యామ్నాయ స్వభావాన్ని సంతరించుకున్నాయని భావించరాదు. గ్రంథాలయాలు ఏర్పడుతున్న దశలో ప్రభుత్వం నుంచి మాత్రమే అవరోధాలు ఏర్పడినట్టు, స్థానికంగా అన్ని వర్గాల వారూ గ్రంథాలయాను ఆహ్వానించినట్టు కనిపించవచ్చును. కానీ అది పూర్తిగా వాస్తవం కాదు. స్థానికంగా భూస్వామ్యశక్తులు గ్రంథాలయాలను వ్యతిరేకించారన్నది కూడా సర్వత్రా నిజం కాదు. గ్రంథాలయాలకు చాలా చోట్ల ప్రభుత్వ యంత్రాంగంలోని వారు, భూస్వాములు కూడా సహాయం చేసినట్లు గమనించవచ్చును. కరీంనగర్ జిల్లాలో మొదటి గ్రంథాలయం 1922 ఏప్రిల్ 22 నాడు హుజూరాబాద్‌లో స్థాపించారు. దీని వ్యవస్థాపకులు స్థానిక తహసిల్‌దార్ కార్యాలయంలో అకౌంటెంట్‌గా ఉన్న సోమవరపు బసవేశ్వరరావు, తహసిల్ ఆఫీసులోనే పేష్కర్‌గా ఉన్న సర్వదేవభట్ల వెంకటరామారావు. ఈ జిల్లాలో 1922 నుంచి 1948 దాకా సుమారు 40 గ్రంథాలయాలు ఏర్పడ్డాయి. వీటిని ప్రారంభించడానికి స్థానిక దేశ్‌ముఖ్‌లు, దేశ్ పాండ్యాలు, న్యాయవాదులు, టీచర్లు, కొందరు మహారాష్ట్రులు, కన్నడిగులు కూడా సహాయం చేశారు. మంథనిలో స్థాపించిన ఉస్మానియాంధ్ర గ్రంథాలయానికి స్థానిక తహసిల్‌దారు ఫరూఖ్ సాహెబ్ అధ్యక్షుడిగా ఉండగా, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచందర్‌రావు నిర్వహణకు కృషిచేశారు. ఫరూఖ్ సాహెబ్ తరువాత స్కూళ్ల అధికారి మౌల్వీ తఫజుల్ హుస్సేన్ అధ్యక్షుడయ్యారు. సిరిసిల్లలోని నారాయణాంధ్ర గ్రంథాలయానికి స్థానిక ప్రభుత్వోద్యోగులు వెంకటరావు, పుండరీకాక్షరావు, వీరేశం కార్యకర్తలుగా పనిచేశారు. అయితే, నిరుత్సాహపరిచిన వారు, వ్యతిరేకించిన వారు కూడా ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. "కొన్ని ముఖ్య పట్టణాల్లో గ్రంథాలయాలు ఏర్పడి పనిచేసినవి. గ్రామాల్లో ఏర్పడినవే చాల స్వల్పం. వాటితో మూతపడినవి హెచ్చు. భూస్వాములకు ఆసక్తి లేకపోవడమే గాక, వాటి ఏర్పాటును వ్యతిరేకించేవారు" (తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర, 1988: 142) అన్న దేవులపల్లి వెంకటేశ్వరరావు అభిప్రాయంలో సార్వత్రిక వాస్తవం లేదు. గ్రామాల్లో కూడా గ్రంథాలయాలు పెద్దసంఖ్యలోనే ఏర్పడ్డాయి. విద్యా విజ్ఞానాల వ్యాప్తిని బహిరంగంగా వ్యతిరేకించడం ఎంతటి కరుడుగట్టిన ప్రజా వ్యతిరేకికి అయినా కష్టం. ఇది గ్రంథాలయాలలోఉన్న సాంస్కృతికమైన అనుకూల అంశం. గ్రంథాలయాలు స్థాపించడం, ఆ స్థాపనకు, వార్షికోత్సవాలకు అధికారులు రావడం, ఆ వార్తలన్నీ పత్రికలలో ప్రచురితమై ప్రజాహిత రంగం అంటూ ఒక కొత్త రంగం ఏర్పడి అందులో కొందరు ప్రముఖులు కావడం– ఇవన్నీ గ్రామాలలో భూముల మీదా, బలహీనుల మీదా పెత్తనాలు చేసేవారి చేతుల్లో లేని విషయాలు. కొత్తగా రంగం మీదికి వస్తున్న ఆధునిక ప్రజాహిత రంగానికీ పత్రికల ద్వారా, చదువుల ద్వారా కొత్తగా గౌరవ మర్యాదలు పొందుతున్న వారికీ, ప్రజలలోని ఏదో ఒక శ్రేణి తరపున ప్రాతినిధ్యం వహిస్తూ ప్రభుత్వంతో వ్యవహరిస్తున్న వ్యక్తులకూ సమకూరుతున్న పలుకుబడిని నిరోధించడం వీరెవరి చేతుల్లోనూ లేదు.


గ్రంథాలయాన్ని ఒక వికాస చట్రంలో భాగమైన వ్యవస్థగా చూడాలి. అది వికాసానికి దోహదం చేయడం ఎంత వాస్తవమో, ఇతర రంగాలలో జరిగిన వికాసంతో గ్రంథాలయాల అవతరణ వికాసం ముడిపడి ఉండడం కూడా అంతే వాస్తవం.

ఆంధ్రోద్యమారంభం తరువాత హైదరాబాద్‌లో స్థాపితమైన గ్రంథాలయాలలో శ్రీ వేమనాంధ్ర భాషానిలయం, బాలసరస్వతీ గ్రంథాలయం ముఖ్యమైనవి. శ్రీ వేమనాంధ్ర భాషానిలయం కృష్ణదేవరాయలు, ప్రతాపరుద్రుడు, రాజరాజనరేంద్రుడు వంటి భాషాపోషకులైన రాజుల పేరుతో స్థాపితమైనది కాదు. శబ్దానుశాసనుడు వంటి సంప్రదాయ కవి పేరిట ఏర్పడినదీ కాదు. వేమన ప్రజా సంప్రదాయానికి చెందిన కవి. అయితే, ఈ గ్రంథాలయానికి ఆ నామకరణం జరగడంతో ప్రజా సంప్రదాయం అన్న పరిగణ కంటే– వేమన రెడ్డి కులస్తుడు అన్న భావన కీలకంగా పనిచేసింది. అప్పటికే రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ తన ఉపన్యాసాల ద్వారా వేమన స్థలాన్ని, కులాన్ని నిర్ధారించి ఉన్నాడు. మద్రాసులో రెడ్డి కుల సమీకరణ బాగా జరుగుతూ వస్తున్నది. కట్టమంచి రామలింగారెడ్డి అందులో ప్రధాన భాగస్వామిగా పనిచేస్తున్నారు. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం సొంత భవనానికి 1921లో కట్టమంచి

రామలింగారెడ్డియే ప్రారంభం చేశారు. వేమనాంధ్ర భాషా నిలయం స్థాపకుడు కొండా వేంకటరంగారెడ్డి. ఆయన ఆ గ్రంథాలయాన్ని తన తండ్రి స్మృతిలోనూ, రెడ్డి కులస్థుడైన యోగి వేమన పేరిట తన సొంత ఖర్చుతో స్థాపించారు. ఈ గ్రంథాలయం 1923 అక్టోబర్ 1 నాడు ఫీల్ఖానాలో ప్రారంభమై, తరువాత నాంపల్లిలోని సొంత భవనానికి మారింది. ఇప్పటికీ నడుస్తున్న, తెలంగాణ ఉద్యమ గ్రంథాలయాలలో ఇది ఒకటి. దీనికి మొదట రంగారెడ్డి సోదరుడు నారాయణరెడ్డి, పెరుమాళ్లు నాయుడు, ఆ తరువాత అక్కినేపల్లి జానకి రామారావు నిర్వహణ బాధ్యతలు వహించారు. రెడ్డి హాస్టల్ స్థాపనం, ఆంధ్ర జనసంఘం ఏర్పాటు మొదలైన వికాస ఘట్టాల క్రమంలోనే ఈ గ్రంథాలయావిర్భావాన్ని కూడా అర్థం చేసుకోవాలి.

హైదరాబాద్‌లో ఆ కాలంలో స్థాపిత మైన మరో గ్రంథాలయం బాల సరస్వతీ గ్రంథాలయం. ''తెలంగాణములో ఆంధ్రోద్యమమునకు మొదటి మెట్టుగా ప్రారంభింపబడిన గ్రంథాలయోద్యమ సందర్భమున బాలసరస్వతీ ఆంధ్ర భాషా నిలయము 27 డిసెంబరు 1922 సంవత్సరమునాడు స్థాపింపబడెను'' (స్వీయచరిత్ర, 1969: 49) అని కొండా వేంకట రంగారెడ్డి ఈ గ్రంథాలయం అవతరణ సందర్భాన్ని పేర్కొన్నారు. ఈ గ్రంథాలయానికి ఈయన సభ్యుడిగా, ఆ తరువాత అధ్యక్షుడిగా పనిచేశారు.

ఈ గ్రంథాలయం స్థాపకులలో ఒకరు, సాహిత్య పత్రిక 'సుజాత' సంపాదకుడు అయిన పసుమాముల నరసింహశర్మ 'బాలసరస్వతి' ఆవిర్భావం, నేపథ్యం ఉస్మానియా యూనివర్సిటీ స్థాపనలో చూశారు. ''1921, 22లో నాకు బంధువులైన బెంగుళూరు నరసింహశర్మ (శ్రీ బి.ఎన్ శర్మ) గారు మరియు నేను, శ్రీ బాలసరస్వతి ఆంధ్ర భాషానిలయమను పేర ఒక గ్రంథాలయం గౌలిగూడ చమన్ సమీపమున శ్రీకృష్ణాజి నాయక్‌గారి




మడిగెలో స్థాపించితిమి... బాలసరస్వతి గ్రంథాలయము స్థాపితమైన కాలము మరియు ఉస్మానియా యూనివర్సిటీ స్థాపితమైన కాలము సుమారు ఒకటే ఐనందున తెలంగాణకు చెందిన వివిధ ప్రాంతముల నుంచి తెలుగు యువకులు ఈ యూనివర్సిటీలో చేరుటకై హైదరాబాద్ చేరసాగిరి. నాయక్‌గారి మడిగెలో గ్రంథాలయముండిన కాలములోన మహబూబ్‌నగర్‌కు చెందిన వేపూరి అనంతశర్మ, నాగులపల్లి కోదండ రామారావు, సూర్యాపేటకు చెందిన కోదాటి రామకృష్ణారావు, కోదాటి వేంకటేశ్వరరావు, ఖమ్మంకు చెందిన పరాంకుశం నారాయణరావు, సిరుగూరు జయరావు (ఐసిఎన్), నందగిరి వెంకట్రావు, లోకా శంకర నారాయణరావు, మాటూరు గోపాలరావు, మాడపాటి రామచంద్రరావు ఇంకను పది ఇరువది మంది వేర్వేరు తెలంగాణ ప్రాంతములకు చెందిన యువకులు ఈ గ్రంథాలయమునకు వచ్చుచు దాని అభివృద్ధికై సాయపడ మొదలిడిరి.'' 'రాయప్రోలు సుబ్బారావు శిష్యత్వం' ప్రాప్తించి తెలుగు మీద అభిమానం పెంచుకున్నారు. ఎల్ఎల్‌బి చదువు తున్నప్పుడు మాడపాటి హనుమంత రావుతో సాన్నిహిత్యం ఏర్పడింది. ఆ సమయంలోనే గోలకొండ పత్రిక కూడా రావడం మొదలైంది. ఆ ప్రేరణతో మాడపాటి హనుమంతరావుతో కలసి, ప్రతాపరెడ్డి, రంగారెడ్డి వంటి వారి సహకారంతో ఆయన 'సుజాత' పత్రిక ప్రచురణ ప్రారంభించాడు. గ్రంథా లయానికి ఎన్ని వికాస కార్యక్రమాలో సంబంధం ఉన్నదో చెప్పడానికి బాలసరస్వతి ఆంధ్ర భాషా నిలయం ఒక మంచి ఉదాహరణ. సూర్యాపేటలో గ్రంథాలయాన్ని స్థాపించి అనుభవం గడించిన కోదాటి రామకృష్ణారావు విద్యాభ్యాసం కోసమే హైదరాబాద్ వచ్చారు. అప్పుడే బాలసరస్వతి సంస్థాపనలో పాలుపంచుకున్నారు.

నల్లగొండ జిల్లా సూర్యాపేట ప్రాంతం ఆంధ్రోద్యమానికి పుట్టినిల్లు. మాడపాటి హనుమంతరావు తన 'తెలంగాణ ఆంధ్రోద్యమము' పుస్తకాన్ని 'తెలంగాణ ఆంధ్రోద్యమమునకు సంఘీభావము, సేవాసక్తి, కార్యదీక్షతో గట్టి పునాది నేర్పరచిన సూర్యాపేట వర్తక సంఘము వారికి' అంకితం చేశారు. అటువంటి సూర్యాపేటలో గ్రంథాలయోద్యమం, ఆంధ్రోద్యమం కంటే పాతది. ఆంధ్రోద్యమం కంటే ముందు నిర్బంధాన్ని చవిచూసిన గ్రంథాలయం సూర్యాపేట ఆంధ్ర విజ్ఞాన ప్రకాశినీ గ్రంథాలయం.

ఈ గ్రంథాలయం వ్యవస్థాపకులు పువ్వాడ వేంకటప్పయ్య, ఆయనే స్థానిక వర్తక సంఘం స్థాపకుడు. ఈయన ఆంధ్రోద్యమ ప్రచార కార్యకర్తగా తరువాత కాలంలో సుప్రసిద్ధులు. తెలంగాణలో విస్తృతంగా పర్యటించి, ఆంధ్ర జన సంఘాల స్థాపనకు, వాటి మధ్య సమన్వయానికి కృషి చేసిన వేంకటప్పయ్య పోలీసుల నుంచి అనేక ఆంక్షలను ఎదుర్కొన్నారు. ఉద్యోగాన్ని కూడా కోల్పోయారు. కృషి ప్రచారిణీ గ్రంథమాలను స్థాపించి కొన్ని పుస్తకాలను ప్రచురించారు. అంకుల్ టామ్స్ కేబిన్ నవలకు చిల్లర శ్రీనివాసరావు అనుసరణం 'శ్రీధర విజయము'ను మాడపాటి

హనుమంతరావు 'క్షాత్రకాలపు హిందార్యులు'ను ఈ గ్రంథమాలే ప్రచురించింది. సూర్యాపేటలో వేదంత భజన మందిరాన్ని స్థాపించి కులమత వివక్ష లేకుండా అందరూ భజన చేసే వసతి కల్పించారు. "భజన కార్యక్రమాలు సామూహిక స్వభావం కలిగి అనతికాలంలోనే ప్రజల సాంస్కృతిక వ్యక్తీకరణకు దోహదం చేసినవి"– అని వరవరరావు విశ్లేషించారు.

వేంకటప్పయ్య నిర్వహణలో ఉండగానే గ్రంథాలయానికి ప్రభుత్వ ఆంక్ష ఎదురయింది. "సూర్యాపేటలో గల ధర్మశాల (సత్రం)లో ఒక గదిలో ఈ గ్రంథాలయాన్ని మొదట నెలకొల్పారు. సూర్యాపేట దేశముఖ్, కుందూరు లక్ష్మీనరసింహారావు గారి అల్లుడు నరసింహారెడ్డి గారిని అధ్యక్షులుగా ఎన్నుకొన్నారు. ఈయన తరువాత కొద్దికాలానికే పరలోక గతుడైనాడు... పోలీసు వారి ఒత్తిడి మూలంగా ఈ సత్రానికి ధర్మకర్త అయిన దేశముఖ్ ఆ గదిని ఖాళీ చేయవలసిందిగా బలవంతపెట్టారు. తరువాత కాలంలో ఈ గ్రంథాలయానికి కోదాటి రామకృష్ణారావు కూడా కార్యదర్శిగా పనిచేశారు. అలీగఢ్ వెళ్లి న్యాయశాస్త్రం చదివి వచ్చి, తెలుగులో కవిత్వం రాసి, సూర్యాపేట ప్రాంతాల్లో సమాజ సంస్కార కార్యక్రమాల్లో పాల్గన్న రామకృష్ణారావు తెలంగాణ వికాస చైతన్యానికి గుర్తు. చాలా చిన్న వయస్సులోనే మరణించిన రామకృష్ణారావుకు జాతీయ, అంతర్జాతీయ రాజకీయాల గురించి చాలా అవగాహన ఉండేదని, చైనా జాతీయ విప్లవ నాయకుడు సన్‌యట్‌సేన్‌ను ఆదర్శంగా చెప్పేవాడని, సూర్యాపేట పరిసర గ్రామాల్లో దళిత వాడలకు వెళ్లి, 'ఇంగ్లండులో ఒక చేతితో పాకీ బుట్ట, మరొక చేత్తో వార్తాపత్రికా పట్టుకుని పనిచేస్తుంటారు. చదువుకోవడానికి ఏదీ అడ్డురాదు, మీరు ఏ పనులు చేసినా సరే చదువుకోవాలి' అని ప్రచారం చేసేవాడని కోదాటి నారాయణరావు తెలిపారు. (వ్యక్తిగత ఇంటర్వ్యూ, డిసెంబర్ 1998) విద్యార్థిగా ఉన్నప్పుడు బాలసరస్వతి గ్రంథాలయం వ్యవస్థాపక సభ్యుడిగా పనిచేసి, మధ్యలో న్యాయవాద విద్య కోసం అలీగఢ్ వెళ్లి వచ్చి, సూర్యాపేటలో కొంతకాలం పనిచేసి, మళ్లీ న్యాయవాద వృత్తి చేపట్టడం కోసం హైదరాబాద్ తిరిగి వెళ్లి ఆ గ్రంథాలయ వ్యవహారాల్లో చురుకుగా పాల్గన్నారు కోదాటి రామకృష్ణారావు. న్యాయవాద వృత్తి ప్రారంభించిన కొద్ది నెలలకే, 1930 కంటే ముందే ఆయన మరణించారు.

వరంగల్ దగ్గరి మడికొండ తెలంగాణ సాంస్కృతిక వికాసానికి దోహదం చేసిన కేంద్రాలలో ఒకటి. ఇక్కడ 1945లో ఆంధ్రమహాసభ జాతీయ పక్షం 12వ మహాసభ జరిగింది. అక్కడ సుప్రసిద్ధమైన గ్రంథాలయం ప్రతాపరుద్ర భాషా నిలయం. 1924లో ఆంధ్రోద్యమం ప్రారంభమై తొలి సంవత్సరాలలోనే యిది ప్రారంభమైంది. దీని స్థాపకులు పెద్ది శివరాజయ్య. మడికొండ కేంద్రం నుంచి తెలంగాణ కవులు, పండితులు చాలామంది తరువాత కాలంలో ప్రసిద్ధులయ్యారు. కాళోజీ నారాయణరావు, కాళోజీ రామేశ్వరరావు, వారి తండ్రి కాళోజీ రంగారావు, వానమామలై వరదాచార్యులు, వారి సోదరుడు లక్ష్మణాచార్యులు, జగన్నాథచార్యులు, వేంకటాచార్యులు, వారి తండ్రి బక్కయ్యశాస్త్రి, తౌటిరెడ్డి గోపాలరెడ్డి, బిరుదురాజు రామరాజు, పల్లా దుర్గయ్య– ఇంకా అనేకమంది మడికొండలో రూపుదిద్దుకున్న ఉద్దండులు. కాళోజీ నారాయణరావు ఆత్మకథనంలో మడికొండలో నాటి వాతావరణం ఇలా ఉన్నది.

"ప్రతాపరుద్ర భాషానిలయం (మడికొండ) నడిపె పెద్ది శివరాజు పురాణాలు చెప్పెటోడు. వెంకటాచార్యులు గారు తెలుగు పురాణాలూ, హిందీ వచ్చిన మా నాయన తులసీదాసు రామాయణం అవీ సాయంత్రాలు చెప్పేటోళ్లు. మడికొండలో నాలుగో తరగతి వరకే ఉండేటిది. హన్మకొండ పక్కనే ఉన్నా, పైచదువులకి అక్కడికి పిల్లల్ని పంపి చదివించాలంటే ఏమైె పోతరోనని భయపడేటోళ్లు. 20 ఏండ్లు వచ్చినా పిల్లవాడి లెక్కన చూసెటోళ్లు. అప్పటికే మడికొండలో రామరాజుగారి చిన్నాయన కొండల్రాజు గారు వకీలు– థర్డ్ గ్రేడో ఏదో పాసైన వారు. వకాలత్‌కి కూర్చుని ఫెయిలయిన వాండ్లు కృష్ణారెడ్డి, కొండారెడ్డి అనే యిద్దరు వకీళ్లు కూడా ఉండిరి. వాండ్ల దగ్గర కూడా కొందరు కోచింగ్ తీసుకునెటోళ్లు. అదీ అక్కడి వాతావరణం. చుట్టుపక్కల గ్రామాల నుంచీ కూడా కొందరు నాయనగారి దగ్గర చదువుకునేదానికి మడికొండల మకాం పెట్టెటోళ్లు. నెలకి బేడకో, పావలాకో గది అద్దెకు తీసుకుని వంట చేసుకునేటోళ్లు. పొద్దున్నె నిద్రలేవడం, పిల్లల్ని ఊరి చివరకి తీసుకెళ్లడం, వ్యాయామం, కసరత్తు చేయించడం, ఉర్దూ కవిత్వంలో తర్ఫీదునివ్వడం నాయనగారి దినచర్య. వెంకటాచార్యులు తెలుగు కవిత్వంలో తర్ఫీదిచ్చేది. ఉర్దూ, తెలుగుల్లో కవిత్వాలు చెప్పేటోండ్లు అప్పటికే తయారైనారు." (కాళోజీ, ఇదీ నా గొడవ, 1995:6)

తెలంగాణలో శైవ, వైష్ణవ మతాల ప్రాబల్యం ఎక్కువగా ఉన్నది. దాదాపు ప్రతి కులమూ శైవ, వైష్ణవ విభజితమై ఉన్నది. తెలంగాణ వికాసోద్యమంలో కూడా ఈ మతధోరణుల ప్రభావం కనిపిస్తుంది. ఆ ప్రభావం రెండు రకాలు. ఒకటి– వికాసోద్యమం వల్ల కొత్తగా రంగంలోకి వచ్చిన గ్రంథాలయాలు, పత్రికా ప్రచురణ సంఘాల నిర్మాణం వంటి కార్యక్రమాలను తమ సొంత సంఘాభివృద్ధి కోసం ప్రారంభించడం, రెండు– తెలంగాణ సాంస్కృతిక, రాజకీయ వికాసానికి తమ సంఘవేదికల ద్వారా కృషి చేయడం. నీలగిరి, తెనుగు పత్రికలు స్థాపించినవారు గోలకొండ వ్యాపారి కులానికి చెందిన శ్రీవైష్ణవ మతానుయాయులు. 1926లో దేశబంధు అనే పత్రికను మెదక్ జిల్లా

వడ్డేవల్లి నుంచి ప్రారంభించిన నరసింహాచార్యులు శ్రీవైష్ణవులు. ఆయన ఈ పత్రిక ద్వారా తమ మతమార్గానికి వేదిక నివ్వడంతో పాటు ఆంధ్రోద్యమానికి కూడా దోహదం చేశారు. తమిళనాడు నుంచి కొన్ని వందల సంవత్సరాల క్రితం తెలంగాణకు విశిష్టాద్వైత ప్రచారానికి వచ్చిన శ్రీవైష్ణవులు (అయ్యావార్లు- అని తెలంగాణలో పిలుస్తారు) రకరకాల ప్రదేశాలలో స్థిరపడ్డారు. అటు పోరాపుర సంస్థానంలోనూ గద్వాల, వనపర్తి, ఆత్మకూరు మొదలైన మహబూబ్‌నగర్ ప్రాంతాల దగ్గర నుంచి ఇటు వరంగల్ జిల్లాలోని మారుమూల గ్రామాల దాకా, ఇటు నల్లగొండ నుంచి అటు ఆదిలాబాద్ దాకా ఈ కుటుంబాలు విస్తరించాయి. కొన్ని స్థానిక బ్రాహ్మణ కుటుబాలు విశిష్టాద్వైతాన్ని స్వీకరించి మతాంతీకరణం కూడా చెందారు. తెలంగాణలో వీరు రక రకాల హోదాలలో ఉన్నారు. మత ప్రచారంలో కొనసాగేవారు, ఆలయ అర్చకత్వంలో ఉండేవారు, ఆర్థిక, విద్యావసతి సరిగా లేనివారు వంటవృత్తిలో ఉండేవారు- అన్నిరకాల వారూ ఉన్నారు. తెలంగాణ గ్రామీణ జీవితంలో వారి ప్రతిపత్తి ఎలా ఉండేదో స్వయంగా శ్రీవైష్ణవులైన వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజల మనిషి' నవలలో చిత్రించారు. అందులో కథానాయకుడు కంఠీరవం శ్రీవైష్ణవుడే. శేషభట్టర్ వేంకట రామానుజాచార్యులు, దాశరథి కృష్ణమాచార్యులు వంటి వారు తెలంగాణ సాంస్కృతికోద్యమ, రాజకీయ ఉద్యమాలలో పాల్గన్నవారు. సాంప్రదాయ పండితులలో అయితే వారిదే అగ్రస్థానం. గోలకొండ కవుల సంచికలోని కవుల జాబితాలో వారిదే అధిక సంఖ్య. అలాగే శైవ సంప్రదాయం కూడా తెలంగాణలో మరొక తరహాలో వ్యాపించింది. దొరల, దేశముఖ్‌ల ఆదరణ శైవానికి తగినంత దొరకలేదుగానీ, క్రింది కులాలలో, మధ్యకులాలలో దీని ప్రాబల్యం ఎక్కువ. భాగ్యరెడ్డి వర్మ శైవసంప్రదాయానికి చెందిన మాల కులస్తుడు. ఆయన పేరులో ఉన్న విశేషణాలకు వారి మతగురువు ప్రోద్బలమే కారణం. శైవ మత ప్రచారకులైన చిదిరెమఠం వీరభద్రశర్మ, ముదిగొండ శంకరారాధ్యులు, ముదిగొండ వీరేశలింగ శాస్త్రి మొదలైనవారు తెలంగాణ సాంస్కృతిక, సాహిత్య వికాసాలకు చాలా దోహదం చేశారు.

వరంగల్‌లో 1918లో స్థాపితమైన శబ్దానుశాసనాంధ్ర భాషానిలయానికి భవనాన్ని దానం చేసిన ముదిగొండ శంకరారాధ్యులు శైవులు. కృష్ణా జిల్లా నుంచి వచ్చినా వరంగల్లునే తన నివాసం చేసుకున్నారు. ఈయన రాసిన గ్రామ పంచరత్నములు, భావలింగ శతకము, మల్లికార్జున శతకము ప్రసిద్ధాలు. ఈయన చాలా శైవకీర్తనలు కూడా రాశారు. 'వారి జీవితంలో ఈ ప్రాంతపు సాంఘిక విషయాలు చాలా ముడిపడి ఉన్నాయి. అవన్నీ వెలుగులోకి రావలసిన అవసరం ఉన్నద'ని కోవెల సంపత్కుమారాచార్య అన్నారు. వరంగల్ కేంద్రంగా పనిచేసిన మరొక శైవ ప్రముఖుడు ముదిగొండ వీరేశలింగ శాస్త్రి. ఆయన 1923 ప్రాంతంలో వరంగల్‌లో స్థాపించిన సంస్కృత పాఠశాలలో పనిచేయడం కోసం గుంటూరు జిల్లా నుంచి తరలివచ్చారు. వరంగల్‌లో శైవ ప్రచారిణి అన్న పక్ష పత్రికను, అదే పేరుతో ఒక గ్రంథమాలను, సంస్థనూ స్థాపించి నిర్వహించారు. ఈ గ్రంథమాల తరపున సుమారు 50 పుస్తకాలు వెలువడ్డాయి. నల్లగొండ జిల్లాకు చెందిన చిదిరెమఠం వీరభద్రశర్మ నిర్వహించిన 'విభూతి' పత్రిక చేసిన కృషి చాలా ఉన్నది. సురవరం ప్రతాపరెడ్డి 'రామాయణ రహస్యములు' అందులోనే సీరియల్‌గా ప్రచురితమైంది. మెదక్ జిల్లా అందోలు తాలూకా ధాకూరు గ్రామానికి చెందిన శైవ ప్రముఖులు, మఠం సిద్ధ వీరయ్య ఆంధ్రోద్యమం ప్రారంభమైన తొలి రోజుల్లోనే జోగిపేటలో 1923లో జోగినాథ గ్రంథాలయాన్ని స్థాపించారు. శేషాద్రి రమణ కవుల పరిశోధనోద్యమ పర్యటనకు తోడ్పడ్డారు. 1930లో అల్లాదుర్గంలో వెంకట రాఘవ గ్రంథాలయాన్ని స్థాపించారు. ఈయన ఉర్దూ నుంచి కథలు అనువాదం చేసి 'గోలకొండ'లో ప్రచురించేవారు. మరాఠీ నుంచి కొన్ని అనువాదాలు చేశారు. సిద్ధ వీరయ్యలో శైవం, ఆంధ్రోద్యమం, సృజనాత్మకత, పత్రికా రచనలు సమ్మిళితమయ్యాయి.

**గ్రంథాలయ కార్యకర్తల సంచారాలు**

ఆంధ్ర జనకేంద్ర సంఘం ఒక సంస్థగా గ్రంథాలయోద్యమానికి చేసిన దోహదాన్ని ప్రత్యేకంగా పేర్కొనవలసి ఉన్నది. కొందరు స్వచ్ఛంద కార్యకర్తలను, కొందరు వేతన కార్యకర్తలను ఆంధ్రజన కేంద్ర సంఘం గ్రామాలకు పంపింది. వారిలో ముఖ్యులు పువ్వాడ వేంకటప్పయ్య, లక్ష్మణశర్మ, గంగుల శాయిరెడ్డి, ఉన్నవ వెంకట్రామయ్య వంటివారు జిల్లాల్లో పర్యటించారు. సురవరం ప్రతాపరెడ్డి కూడా కొన్ని గ్రామాలు పర్యటించారు. పర్యటించినవారు గోలకొండ, నీలగిరి, తెనుగు పత్రికల్లో తమ పర్యటనానుభవాలను, తెలంగాణ స్థితిగతులను రాశారు. తెనుగు, నీలగిరి పత్రికల్లో చాలా భాగం ఇప్పుడు అలభ్యం. ఉన్నవరకయినా ప్రచార కార్యకర్తల అనుభవాలను, రచనలను ప్రత్యేకంగా పరిశీలన చేయవలసిన అవసరం ఉన్నది.

పువ్వాడ వేంకటప్పయ్య కరీంనగర్ జిల్లాలో గ్రంథాలయోద్యమ ప్రచారానికి తీవ్రంగా కృషి చేశారు. అనేక కొత్త గ్రంథాలయాలను స్థాపించడం, మూతపడిన వాటిని తెరిపించడం, నిరాశా నిస్పృహల్లో ఉన్న కార్యకర్తలకు కొత్త ఉత్తేజాన్నివ్వడం ఆయన సాధించిన విజయాలు. వేంకటప్పయ్య కొంతకాలం కరీంనగర్ వెలమ హాస్టల్లో ఉద్యోగిగా కూడా పనిచేశారు. 1926లో గోలకొండ పత్రిక ఒక ప్రత్యేక విలేఖరిని కరీంనగర్ జిల్లా పర్యటనకు పంపింది. వరంగల్‌కు చెందిన తూము వరదరాజులు, దేవులపల్లి వేంకటాచలపతిరావు, కొండారెడ్డి సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, మంథని,

సుల్తానాబాద్, కరీంనగర్, హుజూరాబాద్, పరకాల తదితర ప్రాంతాలలో పర్యటించారు. 1927లో వేములవాడలో రాజరాజేశ్వర గ్రంథాలయాన్ని వరదరాజులు ప్రారంభించారు. వరదరాజులు తరువాత శివరాంభట్ల రామకిషన్‌రావు కూడా జిల్లాలో గ్రంథాలయ ప్రచారానికి విస్తృతంగా పర్యటించారు.

మంథనికి చెందిన లోకే లక్ష్మణ శర్మ ఆంధ్ర జనకేంద్ర సంఘం తరపున 1927 నవంబర్‌లో పర్యటన ప్రారంభించి మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో తిరిగారు. నిజాం రాజ్య జనాభా లెక్కల పుస్తకాన్ని చేతబట్టుకుని, ఊరూరా గ్రంథాలయ నిర్వాహకులను, సాహిత్య సాంస్కృతిక రంగాల్లో పనిచేస్తున్నవారిని కలిసి చర్చించేవారు. ఆంధ్రోద్యమానికి చెందిన మరో ముఖ్య ప్రచారకుడు ఉన్నవ వెంకట్రామయ్య జవారిపేట, గాలిపల్లి, నాగుటుమల్యాల, వడ్లూరు, రుద్రంగి, కోరుట్ల, జగిత్యాల, హుజూరాబాద్‌లలో పర్యటించారు. హుజూరాబాద్ జగదీశ్వర గ్రంథాలయాన్ని అభివృద్ధిపరచటం ఆయన దోహదాల్లో ముఖ్యమైనది. ఈ పర్యటన వివరాలు తెలియజేస్తున్నది ఒక్కటే. గ్రంథాలయోద్యమం కేవలం స్థానికమైనది కాదు. దానికి ఉద్యమ కేంద్రస్థానంతో సంబంధాలు ఉంటూ ఉన్నాయి. అంతేకాదు, గ్రంథాలయాలు కేవలం పట్టణ ప్రాంతాలకు మాత్రమే పరిమితం కాలేదు.

గంగుల శాయిరెడ్డి చేసిన పర్యటన నివేదిక ఒకటి ఆనాటి వివిధ సామాజిక వర్గాలు గ్రంథాలయాల విషయంలో అనుసరించిన వైఖరిని తెలియజేస్తుంది. "చైత్ర శుక్రవారము కడవెర్గుకు వెళ్ళితిని, అచ్చటి దొరవారు పోచానుపల్లికి పోయినారని తెలిసి అదే సమయము అచ్చటికి వెళ్లుచుండగా మార్గమధ్యమున దొరవారు కలసిరి కాని తిర్గక పోచానుపల్లికి పోయితిని. మ.రా తాంౡ రాఘవరెడ్డి గారిచ్చటి దేశ ప్రముఖులు కావున వారితో కలసి నా సమాచారము చెప్పితిని. కొండాపురం గోపాలరెడ్డి గారు తూపురాన్ చీదు నారసింహారెడ్డిగారు చాలా సంతసించితిరి. దొరవారు తుదకు పత్రికలైన తెప్పించి పఠన మందిరము నిర్మించుట మంచిదని వారు కూడా ప్రోత్సాహపెట్టిరి. అపుడచటి నుంచి మ.రా తాంౡ నారసింహారెడ్డి గారు గిరుక్కున లేచి వెళ్ళిరి. భోజనానంతరము మళ్ళీ నేను దొరవారిని మందలించితిని. మా పిల్లలకు పఠనమందభిరుచి లేదని వారు ప్రత్యుత్తరమిచ్చిరి. లక్షాధిపతులయ్యి దేశ ముఖ్యులయ్యి తుదకొక పత్రికను కూడా తెప్పించకపోవుట కదు శోచనీయము. పగలు రెండు గంటలకు వారితో సెలవు పొంది 4 గంటల వరకు కడవెర్గుకు వచ్చి మ.రా పద్మారెడ్డి దేశముఖు గారితో కలసి సంఘీభావము సంగతి సూచించి భాషా నిలయమే కాని లేక పత్రికా పఠన మందిరమైన పౌరుల సాయము చేతనైన మరి యే విధముగానైనా స్థాపించుటుత్తమమని విన్నవము చేసుకుంటిని.." (గంగుల శాయిరెడ్డి పర్యటనము, తెనుగు పత్రిక 28-6-1925:11) ఈ ఉదంతం 'దొరల' వైఖరి మాత్రమే కాకుండా ప్రచారకులు ఎందరెంతమందిని ఎన్ని విధాలుగా ప్రార్థించవలసి వచ్చిందో, ఎన్ని రకాల తిరస్కారాలను భరించవలసి వచ్చిందో తెలుపుతుంది. ఇదే సామాజికవర్గానికి చెందిన వారు బ్రిటిష్ ఆంధ్రలో ఎంత చొరవ చూపించారో పోల్చిచూస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

ఇన్ని ఇబ్బందులను ఎదుర్కొని కూడా తెలంగాణలో నాడు గ్రంథాలయాలు పెద్ద సంఖ్యలో ప్రారంభమయ్యాయి. "ఈ గ్రంథాలయములన్నియు గొప్పవిగా నుండెనని మేము అనజాలము, వానిలో అనేకములు చాలా చిన్నవి. ఒక చిన్ని అలమారును నింపగలిగినన్ని పుస్తకములు, కొన్ని పత్రికలు మాత్రమే వాని సర్వస్వము. గ్రామములో చదువు వచ్చిన వారి సంఖ్యయు స్వల్పమే. నూటికి ముగ్గురు చదువు వచ్చిన వారు గల రాజ్యములోని పల్లెటూళ్లలో నిట్టి పుస్తక భాండాగారములు ఎట్లుండగలవో అవియు అట్లే యుండెను. అయినను 'గ్రంథాలయము' ఉండిన గ్రామములో, ఉత్సాహవంతుడగు యువక కార్యకర్త యొకడున్నాడనియు, ప్రజాహిత కార్యములందభిరుచికి అతడే కేంద్రమై యుండుననియు, మాయనుభవమును బట్టి గుర్తింపగలిగితిమి.'' (తెలంగాణ ఆంధ్రోద్యమము, 1995:28) అన్న మాడపాటి హనుమంతరావు పరిశీలనకు మించి ఆనాటి గ్రంథాలయాల స్వభావానికి వేరే విశ్లేషణ అవసరం లేదు. ప్రధానంగా నిరక్షరాస్య సమాజమైన తెలంగాణలో గ్రంథాలయాలు ఏమి పనిచేశాయో, చేయగలవో మాడపాటికి పూర్తి అవగాహన ఉన్నదని అర్థమవుతుంది. గ్రంథాలయాల గురించి అటువంటి అభిప్రాయాన్ని వరవరరావు వేరే మాటల్లో చెప్పారు. "గడీ నీడల భయం నుంచి ప్రజలను క్రమంగా వెలుగులోకి తెచ్చి విశాల ప్రపంచాన్ని, పోరాట వర్తమానాన్ని, నూతన ప్రపంచాన్ని వినూత్న భవిష్యత్తుని చూపిన చైతన్య సాధనం గ్రంథాలయోద్యమం" (తెలంగాణ విమోచనోద్యమం తెలుగు నవల సమాజ సాహిత్య సంబంధాలు - ఒక విశ్లేషణ, 1983:67).

అయితే గ్రంథాలయోద్యమం- కోస్తా ఆంధ్రలో జాతీయోద్యమంతో ముడిపడి ఉంటే ఇక్కడ ఆంధ్రోద్యమంతో పెనవేసుకుపోయింది. అక్కడ సాహిత్య, పరిశోధనా, పత్రికా, గ్రంథాలయ, సంఘసంస్కరణ రంగాలన్నిటిలోనూ పనిచేసిన వ్యక్తులు లేకపోలేదు కానీ, ప్రతి రంగానికీ ప్రత్యేకమైన కార్యకర్తలు కూడా ఉన్నారు. తెలంగాణలో పరిస్థితి అది కాదు. ఒకరే అనేక రంగాలలో ఉన్నట్టు గమనిసాము. అందుకు ఒక కారణం రాజకీయ సామాజిక ఉద్యమాలేవీ ఉధృతంగా లేకపోవడం వల్ల చైతన్యవంతులకు, క్రియాశీలురకు తగిన సమయం ఉండడం అయితే, మరో

ముఖ్యమయిన కారణం, ఇక్కడ అన్నిరకాల పనులు చేయడానికి తగినంతమంది లేకపోవడం. ఒక గ్రామంలో ఒక వ్యక్తి స్థాపించిన గ్రంథాలయం ఆ వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోగానే పాడుపడిపోవడం అనేకచోట్ల జరిగింది. ఈ పరిస్థితి ఎందుకున్నది అని ప్రశ్నించుకుని మాడపాటి హనుమంతరావు ఇలా సమాధానం చెప్పారు. "ఇట్టి పరిస్థితులకు కారణమేమిటి? గ్రామమంతటిలోను కార్యకర్తయు పాఠకుడును, ఉపన్యాసకుడును, పత్రికా విలేఖరియు, నాయకుడును– యిది యది యననేల? – సర్వమును అతడొకడేయైయుండుటయే ఇందుకు మూలకారణమని చెప్ప వలయును.'' (తెలంగాణ ఆంధ్రోద్యమము, 1995:29)

గ్రంథాలయోద్యమం మొదటి మహాసభ 1925లో మధిరలో జరుపుకున్నది. 1927లో గ్రంథాలయాల రెండవ మహాసభ సూర్యాపేటలో చాలా భారీ ఎత్తున జరిగింది. ఈ సభలే ఆంధ్ర మహాసభ ఆవిర్భావానికి ప్రేరణ ఇచ్చాయి. ఉద్యమం మలిదశలో గ్రంథాలయోద్యమం ఏకైక ప్రధాన ఉద్యమంగా లేదు. ఏర్పడిన గ్రంథాలయాల నుంచి ప్రయోజనం, చైతన్యం పొందిన యువకులు, విద్యార్జన చేసి పత్రికా, పుస్తక పఠనం ద్వారా ఆదర్శాలను అలవరచుకున్న యువకులు తగినంత సంఖ్యలో రూపొందారు. మరికొన్ని మారుమూల ప్రాంతాలలో కూడా గ్రంథాలయాల స్థాపన ఒక ఉద్యమంగా 1930 తరువాత కూడా కొనసాగింది. కానీ, తెలంగాణ సాంస్కృతిక రంగం – గ్రంథాలయోద్యమం స్థాపితమైన నాటి కంటే బలపడ్డది. ఇప్పుడు అనేక పత్రికలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా ఉద్యమానికి, మొత్తంగా తెలంగాణ ఆత్మాభిమానానికి చిహ్నంగా గోలకొండ నిలబడ్డది. అనేక గ్రంథమాలలు అవతరించాయి. హైదరాబాద్‌లో చదువుకున్న చదువుకుంటున్న యువకులు అనేకమంది బృందాలుగా ఏర్పడి సాహిత్య వ్యాసంగాలు చేయడం మొదలుపెట్టారు. మరోవైపు కోస్తా ఆంధ్ర నుంచి జాతీయోద్యమ, వామపక్ష భావాలు క్రమంగా తెలంగాణకు కూడా సోకసాగాయి. ఆంధ్రోద్యమమే సాహిత్య, సాంస్కృతిక రంగాలకు ప్రాధాన్యం తగ్గించి సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలను ఎక్కువ పట్టించుకోవడం మొదలుపెట్టింది. భాషా సాంస్కృతిక ప్రాధాన్యాలను రాజకీయ ప్రాధాన్యాలు తోసి రాజనడం రెండు మూడు సందర్భాలలో ఆంధ్ర మహాసభలలోనే జరిగింది. మరోవైపు, గ్రంథాలయాలతో, గ్రంథమాలలతో, ఉద్యమంతో సంబంధం లేకుండానే రచయితలయ్యే కొత్తతరం ప్రారంభమయింది.

1901లో హైదరాబాద్‌లో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం స్థాపనతో తెలంగాణ రాజకీయ, సాంస్కృతిక చరిత్రలో నూతన ఆరంభం జరిగిందని స్థూలంగా చెప్పుకోవచ్చు. 1920లలో ప్రారంభమయిన నైజాము రాష్ట్ర ఆంధ్రోద్యమానికి, ఆ తరువాతి రాజకీయ పరిణామాలకు బీజం శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం స్థాపనతోనే పడిందని చారిత్రక పరిశీలనలో అవగతమవుతుంది. అయితే, తెలంగాణలో భాషా, సాంస్కృతిక, రాజకీయ రంగాలలో నూతన భావాలు ప్రవేశించడానికి ముందు, ముఖ్యంగా ఆంధ్రోద్యమం ప్రారంభం కావడానికి ముందు తెలంగాణలో సర్వం అంధకార బంధురమేనని, ఎటువంటి చలనమూ లేని జడస్థితి ఉన్నదని చెప్పడం అతిశయోక్తి మాత్రమే కాదు, అర్ధ సత్యం కూడా. ఈ అర్ధసత్యాన్ని ప్రకటించిన వారిలో అన్ని ప్రాంతాల రచయితలూ ఉన్నారు.

అనేక చారిత్రక కారణాల వల్ల తెలంగాణలో సాహిత్యం బ్రిటిష్ ఆంధ్రలో వచ్చినంత పరిమాణంలో రాలేదు. వచ్చిన సాహిత్యం కూడా చరిత్రలోకి ఎక్కిలేదు. ఆ అంతరాన్ని భర్తీ చేస్తే, ఈ శతాబ్దపు తొలి దశాబ్దాలలోని తెలంగాణ సామాజిక రాజకీయ చరిత్రను పునర్నిర్మించడానికి కూడా ఎంతో దోహదకారిగా ఉంటుంది. లేకపోతే, దాశరథి రంగాచార్య ఎంతో ఆవేదనతో అన్నట్టు– 'తెలంగాణ అంటే ఒక గడీ, ఒక బాంచ' అని మాత్రమే బయటి ప్రపంచం భావిస్తూ ఉంటుంది. తెలంగాణ వాస్తవికతలో ఫ్యూడల్ దోపిడీ తప్పనిసరిగా ఒక భాగమే కాని, దాన్ని ఎదుర్కొని లేదా దానిని మించి జరిగిన వికాస ప్రయత్నాలు వర్తమానానికి ఎక్కువ ఉపయోగకరాలు.

తెలంగాణలో జరిగింది బ్రిటిష్ ఆంధ్రలో జరిగినటువంటి ఆంధ్రోద్యమం కాదు. అది కేవలం భాషా సాంస్కృతికోద్యమం కాదు. భాషా జాతీయత రాజకీయమైన నిర్మాణం. అందులో తెలంగాణ సాహిత్యం నిర్మాణాత్మకమైన కృషి చేసింది.

తెలంగాణ సాహిత్య రంగంలో సాహిత్య ప్రయోజనం గురించిన చర్చ ఎప్పుడూ ప్రధానం కాలేదు. సాహిత్యాన్ని సాంస్కృతికోద్యమ, రాజకీయ ప్రచారానికి ఉపయోగించడాన్ని తెలంగాణ ఎప్పుడూ అనుమతించింది.

**('తెలంగాణ సాహిత్య వికాసం' (ఆధునికత వైపు సొంత అడుగులు.. 1900–1940) పుస్తకంలోని కొన్ని అంశాలివి. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య తెలుగు సాహిత్యం: తెలంగాణలో సాహిత్య పునర్వికాసం (1919–1939) అన్న శీర్షికతో తెలుగు విశ్వవిద్యాలయానికి పి.హెచ్.డి పట్టా కోసం 1999లో సమర్పించిన సిద్ధాంత వ్యాసం ఆధారంగా రూపొందించినదీ పుస్తకం. సిద్ధాంత వ్యాసరచనకు 2000లో డాక్టరేట్ లభించింది. కె. శ్రీనివాస్ సాహిత్య విద్యార్థి, రచయిత, విమర్శకులు, పరిశోధకులు, పాత్రికేయులు. ప్రస్తుతం ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకులుగా పని చేస్తున్నారు)** ⊙

# గెలవండి, సమాజాన్ని గెలిపించండి!






విద్యార్థులు తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని తమ సుఖంతో సమాజ హితాన్ని కలుపుకుని దీక్షగా కష్టపడితే తిరుగులేని అభివృద్ధిని సాధిస్తారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. పిల్లల ఇష్టాలకు వ్యతిరేకంగా వారిని బలవంతంగా వేరే రంగాల వైపు మళ్లించొద్దని తల్లిదండ్రులను కోరారు. పిల్లల ఇష్టాలను గుర్తించటంతోపాటు వారికి సామాజిక దృష్టిని అందించటం, వారి కోసం మంచి సమాజాన్ని నిర్మించే ప్రయత్నం చేయటం ప్రతి తల్లీ, తండ్రీ చేయాల్సిన బాధ్యత అన్నారు. ఈ విషయంలో కళాశాలల యాజమాన్యాలు కూడా కౌన్సెలింగ్ నిర్వహిస్తుండాలని అన్నారు. సిక్కోలు యువశక్తి సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో జరిగిన యూత్ పార్లమెంట్-2017లో జేపీ ముఖ్య అతిథిగా ప్రసంగించారు.

చదువును మించిన సంపద, ఎదుగుదలకు ప్రయత్నాన్ని, శ్రమను మించిన సాధనాలు లేవని జేపీ అన్నారు. సంకల్పబలం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ.. ప్రకృతి ఇచ్చిన ఈ మూడు శక్తులూ ప్రతి ఒక్కరిలో ఉంటాయని, వాటిని ప్రతి విద్యార్థీ సక్రమంగా వినియోగించు కోవాలన్నారు. అద్భుత విజయాలను సృష్టించినవారిలో అనేకమంది గ్రామస్థాయి నుంచి వచ్చిన వారేనన్నారు. కలల సాకారం కోసం తప్పటడుగు వేయవద్దని, ఇతరులకు నష్టం కలిగించవద్దని సూచించారు. మన వల్ల సమాజం నష్టపోతే అంతకంటే తప్పు ఇంకోటి ఉండదని, ఆ ప్రభావాన్ని మనతో సహా ప్రతి ఒక్కరూ అనుభవించాల్సి ఉంటుందని అన్నారు. ఈ వాస్తవాన్ని గుర్తుంచుకుని, విద్యార్థులు తమ కెరీర్‌తో పాటు సమాజ హితాన్ని కూడా జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. ఈ దిశగా యువతలో చైతన్యం అవసరమన్నారు. తమ పార్టీవారికే అన్ని ఫలాలూ అందించేరీతితో రాజకీయాలు తయారయ్యాయన్నారు. జుగుప్సాకరమైన పదజాలంతో విరుచుకుపడే నాయకులే మీడియాకు సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా మారారన్నారు. వాస్తవాలు వెలుగులోకి తెచ్చేవారిపై బురదజల్లేవారు ఎక్కువయ్యారన్నారు. నవ సమాజ నిర్మాణానికి యువతే కీలకమన్నారు. యువత ఒక లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణతో సాధన చేస్తే విజయం సొంతమవుతుందనటానికి ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చి సివిల్స్‌లో జాతీయస్థాయిలో మూడో ర్యాంకును సొంతం చేసుకున్న రోణంకి గోపాలకృష్ణ, ఎవరెస్ట్ శిఖరంపై భారత జెండాను ఎగురవేసిన కృష్ణారావులే నిదర్శన మన్నారు. చెమటోడ్చే వ్యక్తిత్వంగల ప్రజలు శ్రీకాకుళం జిల్లాలో ఉన్నారన్నారు. 'చేయి చేయి కలుపుదాం.. ముందుకు సాగుదాం.. మానవ వికాసానికి హద్దులు లేవు' అన్నారు.

శ్రీకాకుళం ఎంపీ కె.రామ్మోహన నాయుడు మాట్లాడుతూ, మన ఆలోచనల్లో వెనకబాటుతనాన్ని వదిలించుకుంటే శ్రీకాకుళం జిల్లాలో అభివృద్ధికి బోలెడు వనరులు కనిపిస్తాయన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు యువత ముందుకు రావాలని, తాను అండగా ఉంటానని తెలిపారు. సిక్కోలు యువత పదిమందికీ స్ఫూర్తిగా నిలవాలన్నారు. యువత మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి కోరారు. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చేలా వ్యవహరించాలి తప్ప చిన్నచిన్న విషయాలకు మనస్తాపం చెంది తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దన్నారు.

యువత సామాజిక రుగ్మతలపై స్వేచ్ఛగా పోరాటం చేయాలని జిల్లా కలెక్టర్ కె.ధనుంజయరెడ్డి పిలుపు నిచ్చారు. యువశక్తితో పార్లమెంటులో చట్టాలు వచ్చిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. గోపాలకృష్ణ మాట్లాడుతూ, కాలం విలువైనదని, లక్ష్యం కోసం అలుపెరగని పోరాటం చేయాలని అన్నారు. జీవితంలో 18 నుంచి 30 ఏళ్ల వయసు కీలకమైనదన్నారు. ఈ సమయంలో తీసుకున్న నిర్ణయాలు వ్యక్తి జీవితానికి బాటలు వేస్తాయన్నారు. యువత ఉన్నతంగా ఆలోచిస్తే ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారన్నారు. యువత ఒక శక్తి భాండాగారని, ఆలోచనలు చేయటమేకాదు ఆచరణ ఎలా అనే అంశం మీద కూడా విద్యార్థులు దృష్టి సారించాలని సిక్కోలు యువశక్తి డైరెక్టర్ ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి సూచించారు.

## 'కాజ్ ఆఫ్ ట్రూత్' మాత్రమే నిజమైన చదువు




ప్రజాస్వామ్యాన్ని మార్చాలంటే తరతరాలు కావాలని, యువత ఎక్కడికక్కడ పెద్దఎత్తున పాలుపంచుకోవాలని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. దృక్పథం, వ్యూహం, లక్ష్యం, తపన, అవగాహన, శక్తి, ఆలోచన యువతలో బలంగా ఉండాలన్నారు. నిజమైన ఎడ్యుకేషన్ అంటే 'కాజ్ ఆఫ్ ట్రూత్' అన్నారు. సమాజ హితం కోరనివారు ఎంత విజ్ఞానవంతులైనా ఉపయోగం లేదన్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల (ఐతమ్)లో 'దేశ భవిత-యువత పాత్ర'పై నిర్వహించిన సదస్సులో విద్యార్థులనుద్దేశించి జేపీ మాట్లాడారు. రాజుల నుంచి నేటి మంత్రుల వరకు దేశం మీద, ప్రజల మీద పడి తినడం పద్ధతి అనుకుంటున్నారని, అధికారాన్ని ప్రజలు పూజించటం మానేయాలని అన్నారు. అధికారులు ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ పెద్దల ఖర్చుల కోసం లంచాలు తీసుకుంటున్నామని చెబుతుండటం భావ్యం కాదని అన్నారు. ఉన్నతాధికారులు ముందుగా సంప్రదాయాలు, విలువలు పాటిస్తే కిందివారు అవే పాటిస్తారని, సంస్కరణలు పైస్థాయిలోనే ఎక్కువ జరగాలని అన్నారు. మౌలికమైన అంశాలలో రాజీపడవద్దని యువతకు జేపీ సూచించారు. హింసా యుద్ధాలు, పోరాటాలు చేయనక్కర్లేదని, అదేవిధంగా కలిసి బతికే క్రమంలో ఒంటెద్దు పోకడలు పనికిరావని అన్నారు. విందులకు, వినోదాలకు ఖర్చు చేయకుండా, ఎక్కడ పోరాడాలో ఎక్కడ రాజీపడాలో తెలుసుకోవాలని అన్నారు. ఉపాధి హామీ చట్టంపై ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ.. ఆ సమయంలో తాను జాతీయ సలహామండలి సభ్యునిగా ఉన్నానని, ఏడు నెలలు ఆపగలిగానని, ఉపాధి కల్పించటమంటే గుంతలు తవ్వటం, పూడ్చటం కాదని జేపీ అన్నారు. ఉపాధి హామీ అమలుచేస్తున్నారు కాబట్టి.. భూగర్భ జలాలు, భూసారం పెరిగే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల సృష్టి ద్వారానే పేదరికం పోతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా 700కోట్ల జనాభా ఉంటే, ఉత్పత్తిరంగంలో 18కోట్ల జనాభా పనిచేస్తున్నారన్నారు. ఉత్పత్తిరంగంలో ఎక్కువ ఉపాధి అవకాశాలు లేవని, ఆరోగ్యరంగం మీద దృష్టి పెడితే ఎక్కువ ఉద్యోగాలస్తాయని అన్నారు. అందరికీ ఉపాధి కల్పించడం పాలనకు పెద్ద పరీక్ష అన్నారు. కార్మిక శక్తికి అనుగుణంగా ఉన్న రంగాలలో మాత్రమే ఉద్యోగాలు సాధ్యమన్నారు. ఏటా లక్షలమంది విద్యార్థులు డిగ్రీ పట్టాలతో బైటికొస్తున్నా నైపుణ్యాలు లేక లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించుకోలేకపోతున్నారన్నారు. సమాజం కోసం పాటుపడిన వ్యక్తులు చెప్పిన సూక్తులు, ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వాలు పనిచేస్తే దేశంలో విద్య, ఆరోగ్య రంగాలలో వెనుకబాటుతనం ఉండదన్నారు. గతం కంటే భవిష్యత్తు బాగుంటుందనే ఆశావహ దృక్పథంతో ముందుకెళ్లాలని సూచించారు. సమయాన్ని మించిన నియంత లేదని, దాని విలువ తెలుసుకోవాలన్నారు. అవకాశాలను జారవిడుచుకోకుండా అందిపుచ్చుకుని భవిష్యత్తులో రాణించాలన్నారు. సాంకేతిక, ఆటోమొబైల్ రంగాలలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని, లక్ష మెగావాట్ల సోలార్ విద్యుత్ ఓ పెద్ద పరిణామమని అన్నారు. దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ మాటను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, సాంకేతిక విద్యనభ్యసించేవారు సమాజహితం కోరేలా పరిశోధనలు చేయాలని విజ్ఞప్తి చేశారు. లోక్‌సత్తా ఉద్యమంతో మూడు రాజ్యాంగ సవరణలు, ఏడెనిమిది పెద్ద చట్టాలు దేశంలో వచ్చాయని, దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం యువత పాటుపడాలని జేపీ పిలుపునిచ్చారు. కళాశాల ఛైర్మన్ కొంచాడ సోమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో డైరెక్టర్ వి.వి నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.బి మధుసాహు, కార్యదర్శి ఎల్.ఎల్ నాయుడు, పాలనా విభాగం డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ్ విద్యార్థినీవిద్యార్థులతో సురాజ్య ప్రతిజ్ఞ చేయించారు. సిక్కోలు యువశక్తి సంస్థ వ్యవస్థాపకురాలు గీతాశ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతోపాటు విద్యార్థులు కూడా తమ భావాలను పంచుకున్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, లోక్‌సత్తా 2.0 ఉద్యమసంస్థ తెలంగాణ, ఏపీ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, సంస్థ ప్రతినిధులు ఎం.వి.ఎస్.ఎస్ శాస్త్రి, సినీ పరిశ్రమకు చెందిన దానేటి జగదీష్, సత్యకిషోర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ⊙

# పోలవరంపై పాలకులు ఆలస్యంగా మేలుకొన్నారు, మహానది–గోదావరినీ అనుసంధానం చేయాలి: జేపీ






వరదల ద్వారా ఏటా వేల టీఎంసీల నీరు వృధాగా సముద్రంలో కలసిపోతున్న తరుణంలో 194 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న అంతర్రాష్ట్ర బహుళార్థ ప్రాజెక్టు పోలవరంపై అపోహలు తగదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే కర్ణాటక 21 టీఎంసీలు, మహారాష్ట్ర 14 టీఎంసీల కృష్ణా జలాలు వాడుకోవచ్చని, తెలంగాణ, ఒడిషా కూడా గోదావరి జలాలను వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుందని అన్నారు.

పోలవరం ప్రాజెక్టు పనులను జేపీ పరిశీలించారు. ముందుగా పట్టిసీమ ఎత్తిపోతల పథకం, ఇటుకల కోట వద్ద డెలివరీ పాయింట్‌లను, అనంతరం ప్రాజెక్టు వద్ద కీలకమైన స్పిల్‌వే, డయాఫ్రంవాల్ నిర్మాణ పనులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్టు నమూనా ద్వారా ఎస్‌ఈ రమేష్‌కుమార్ వ్యూ పాయింట్ నుంచి అన్ని అంశాలను తెలియచేశారు. లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, లోక్‌సత్తా 2.0 ఉద్యమ సంస్థ తెలంగాణ, ఏపీ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ నేతలు డా॥ పట్టాభి రామయ్య, గొట్టుముక్కల జానకిరామరాజు, మానేపల్లి కిరణ్‌కుమార్, సాగి జానకిరామరాజు, పంచాది రాంబాబు, ప్రాజెక్టు ఈఈలు కుమార్, పుల్లారావు, బుల్లయ్య, ట్రాన్స్‌ట్రాయ్ జీఎంలు సత్యనారాయణ, మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కీలకదశలో ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషితో సకాలంలో పూర్తవుతుందని ఆశిస్తున్నానని జేపీ అన్నారు. డెల్టాలో ఆయకట్టును స్థిరీకరించి ఏడు లక్షల ఎకరాలకు అదనంగా సాగునీరు అందిస్తూ రాయలసీమ, తెలంగాణ మెట్ట ప్రాంతాలకు నికర జలాలను అందించే ముఖ్యమైన ప్రాజెక్టు అయినా పోలవరాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పనులు వేగంగా జరిగివుంటే ఇప్పటికే ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేదని, రాష్ట్ర విభజన జరిగాక కూడా రెండేళ్లపాటు పట్టించుకోలేదని అన్నారు. పాలకులు ఆలస్యంగా మేలుకోవటం వల్ల తాగు, సాగునీటిపరంగానేకాకుండా ఆర్థికపరంగా కూడా తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. అంచనాలు భారీగా పెరిగి ఖజానా మీద భారం పడిందన్నారు. పోలవరం పూర్తయితే మళ్లీ రూ. 2,000కోట్లతో పట్టిసీమ అవసరం ఉండేది కాదన్నారు. ఇప్పుడు కూడా పట్టిసీమ ఉంది కదా

అని పోలవరాన్ని నిర్లక్ష్యం చేసే ధోరణులు ప్రదర్శించవద్దన్నారు. ప్రస్తుతం పనులు వేగంగానే జరుగుతున్నాయని, కేవలం 9 నెలల్లో 70శాతం మట్టిపనులు చేయటం రికార్డని అన్నారు. పోలవరంలో కీలక నిర్మాణమైన డయాఫ్రం వాల్‌కు ఎగువన, దిగువన నిర్మించే కాఫర్‌డ్యాంలు పూర్తి కావాల్సుందన్నారు. వాతావరణం అనుకూలిస్తే అనుకున్న సమయానికి పూర్తి కావచ్చున్నారు.

పోలవరం నిర్మాణంతో గోదావరి జలాలతో రాష్ట్రంలో రాయలసీమతోపాటు శ్రీకాకుళంవాసుల తాగునీటి కష్టాలు తీరుతాయని జేపీ అన్నారు. విశాఖలో చిన్న ఎత్తిపోతల పథకం నిర్మిస్తే గోదావరి జలాలను శ్రీకాకుళం తరలించవచ్చున్నారు. దేశవ్యాప్తంగా అన్ని నదులనూ అనుసంధానించటం (గార్లెండ్ కెనాల్ ప్రాజెక్ట్) సరికాదని, కానీ గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేసినట్టే, మహానది, గోదావరి నదులను కూడా అనుసంధానించాలని అన్నారు. పట్టిసీమను పెన్నాకు అనుసంధానం చేయటం ద్వారా రాయలసీమతోపాటు చెన్నై వరకూ నీటి సరఫరా చేసే అవకాశం ఉంటుందన్నారు.

గతంలో శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం సమయంలో రైతులకు అన్యాయం జరిగిందని, ప్రస్తుతం పోలవరం ప్యాకేజీ బాగుందని, అధికారులు దళారులు, అవినీతి లేకుండా అందించాలని జేపీ అన్నారు. నిర్వాసితులకు పూర్తి న్యాయం చేసి ప్రాజెక్టును నిర్మించాలని డిమాండ్ చేశారు.

# స్థానిక న్యాయాలయాలతోనే సత్వర న్యాయం, ప్రజలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలి

ప్రజలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తేనే దేశాభివృద్ధి సాధ్యమని, ఇందుకోసం ఇటీవల నరేంద్రమోదీ ప్రభుత్వానికి కూడా నీతి ఆయోగ్ ద్వారా లోక్‌సత్తా నమూనా విధానాలను అందించిందని లోక్‌సత్తా 2.0 ఉద్యమసంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ బండారు రామ్మోహనరావు తెలిపారు. లోక్‌సత్తా కృషితోనే 2008లో వచ్చిన గ్రామీణ (స్థానిక) న్యాయాలయాల చట్టాన్ని ఇంతవరకూ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు అమలుచేయకపోవటం దారుణమన్నారు. పేద, మధ్యతరగతికి తక్కువ ఖర్చుతో, త్వరగా న్యాయంచేయటానికి, మహిళల భద్రతకు ఈ స్థానిక న్యాయాలయాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కేంద్రం స్థానిక న్యాయస్థానాల ఏర్పాటుకు నిధులు ఇస్తామన్నా తెలుగు నాట పాలకులు స్పందించటం లేదన్నారు. వీటిని వెంటనే ఏర్పాటు చేయండయ్యా అని కోరుతూ లోక్‌సత్తా జేపీ శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు కూడా రెండుసార్లు ముఖ్యమంత్రులకు లేఖ రాశారన్నారు. వెంటనే స్థానిక న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలన్నారు. లోక్‌సత్తా 21వ ఆవిర్భావదినోత్సవం సందర్భంగా ఉద్యమనేతలతో కలిసి రామ్మోహనరావు రాజమండ్రిలో మీడియాతో మాట్లాడారు. అధికారం లేకపోతే ప్రజల గురించే పట్టించుకోని నాయకులు, చిన్న సేవాసంస్థ ద్వారా నలుగురికి సేవలందించటమే గొప్ప అనే పరిస్థితులు ఉన్న దేశంలో ఒక్క పార్లమెంటు సభ్యుడు కూడా లేకుండా లోక్‌సత్తా దాదాపు 16 అద్భుత రాజ్యాంగ సవరణలు, చట్టాల్ని తీసుకొచ్చిందన్నారు. లక్షలాదిమందిని కొత్త రాజకీయం వైపు ఆలోచింపచేసిందన్నారు. లోక్‌సత్తా వచ్చాక రాజకీయంలో కొన్ని అంశాలు ఇంకా దిగజారాయని, కానీ వాటికి నిర్దిష్ట పరిష్కారాలు మాత్రం ప్రజల చేతుల్లోకి చేరాయని అన్నారు. ఎప్పుడు వాటిని వినియోగించాలి అన్నది ప్రజలిష్టమని, కానీ ఏం చేయాలి అనే సందేహం, గందరగోళం మాత్రం లేకుండా లోక్‌సత్తా చేయగలిగిందని అన్నారు. సమాచార హక్కు చట్టం దగ్గర్నుంచి ఇటీవల స్థానిక ప్రభుత్వాలకు 14వ ఆర్థిక సంఘం నిధులు పెంచటం దాకా లోక్‌సత్తా కృషి ఉందన్నారు. వీటికి కొనసాగింపుగానే.. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు, విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగపరంగా నిధులు, అధికారాల బదిలీ, తలసరి నిధులు, వ్యవసాయ సంస్కరణలు, కుల నిర్మూలన కోసం లోక్‌సత్తా 2.0 ఉద్యమం కార్యాచరణను చేపట్టిందన్నారు. ఈ అంశాలపై జనచైతన్యానికే జేపీ త్వరలో ఏపీలో 100రోజుల ప్రచార యాత్రలు నిర్వహిస్తున్నారన్నారు. తర్వాత ఇదేతీరులో తెలంగాణలోనూ ప్రచారం చేపడతారన్నారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ నేతలు ఎం.వి రాజగోపాల్, ఎస్.ఎస్ రామచంద్రమూర్తి, బి.ఎస్ వర్మ, జె.రవి, డి.జార్జిప్రసాద్, రాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ⊙

**1955** రిపబ్లిక్ దేన తెలుగునాట 'అర్థాంగి' అనే సినిమా విడుదలైంది. అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి నాయకానాయికలు. 'దేవదాసు'కి కథనందించిన శరత్ చంద్ర ఛటోపాధ్యాయే ఈ సినిమాకి కూడా కథనిచ్చారు. అయితే దేవదాసు (1953) కంటే అర్థాంగి కొన్ని కోణాల్లో తమకు బాగా నచ్చిందని, అక్కినేని, సావిత్రి నటన సమతూకంతో ఆకట్టు కుంటుందని అన్నవాళ్లూ ఉన్నారు.



# డ్రగ్స్: యుద్ధం ప్రకటించాల్సిందే!

అర్థాంగిలో కథానాయకుడు సంపన్నుల కొడుకు. సవతి తల్లి పెంపకంలో పెరుగుతాడు. అయితే ఆమె తన కన్నబిడ్డకు ఆస్తి రావాలనే దురుద్దేశంతో అతనికి చిన్నప్పటి నుంచీ నల్లమందును అలవాటు చేయిస్తుంది. దాంతో అతడు మందమతిలా తయారవుతాడు. పిల్లవాడికి నల్లమందు అలవాటు చేయటం గురించి తెలియకపోయినా.. కొడుకు మందమతి అనే విషయాన్ని దాచిపెట్టి అతనికి తండ్రి వివాహం చేస్తాడు. భర్త తెలివిలేనివాడు అని తెలుసుకున్న భార్య దిగ్భ్రాంతి చెందుతుంది. మావగార్ని ప్రశ్నిస్తుంది. అదేసమయంలో తన భర్తను తెలివైనవాడిగా, సమర్థుడిగా మార్చుకునేందుకు తన వంతు ప్రయత్నం ప్రారంభిస్తుంది. కొంత వైద్యసాయం అందించటంతోపాటు తానే టీచర్‌గా మారి మంచి చదువును అందిస్తుంది. క్రమంగా అతని మెదడులోని మకిలి తొలగిపోతుంది. తనలోని శక్తిసామర్థ్యాలను వికసింపచేసుకుని నిజమైన కథానాయకుడిగా మారతాడు. ఆ తర్వాత ఇదే ఇతివృత్తంతో మరికొన్ని సినిమాలు కూడా ప్రేక్షకాదరణ పొందాయి. ఒక వ్యక్తిని మత్తులో ముంచినవారిని మనం విలన్లుగా ఈసడించుకున్నాం. అతని బాగు కోరటాన్ని, ఆ వ్యక్తి బాగుపడటాన్ని, తిరిగి నాయకుడిలా వ్యవహరించడాన్ని ఒక సమాజంగా మనందరం ఇష్టపడ్డాం, అభిమానించాం, ఆదరించాం. ఇప్పటికీ మన ధోరణిలో పెద్దగా ఏమీ మార్పు లేదు. కానీ మన జీవితాల్ని చాలామేర ప్రభావితం చేసే రాజకీయాలు మనల్ని బాగు చేయటం కంటే మత్తులో ఉంచటానికే ప్రయత్నిస్తున్నా మనలో చాలామంది ఇంకా గుర్తించలేకపోతున్నారు. 10-15శాతం మంది గుర్తించినా మిగతావారిని మేలుకొలిపే రీతిలో స్పందించలేకపోతున్నారు. నిలబడి బాధ్యత తీసుకోలేకపోతున్నారు.

పూర్వకాలం నుంచే రాజులు, ఉన్నత కుటుంబాలవారు మాదక ద్రవ్యాల్ని ఉపయోగిస్తుండేవారు. దాని గురించి మనం పట్టించుకోనక్కర్లేదు. అది వారి సమస్య. కానీ ప్రజలు తమ మీద తిరగబడకుండా వాళ్లు రాజకీయంగా వివిధ ఇతర రూపాలలో మత్తును ప్రయోగిస్తూ వచ్చారు. అందులో మతం ప్రముఖమైనది. ఈ మాటను కార్ల్ మార్క్స్ స్పష్టంగా సూత్రీకరించి మరీ చెప్పారు. ఆధునిక ప్రజాస్వామ్య దశ వచ్చినా భారత్ సహా చాలా దేశాలలో మతంతోపాటుగా ఇంకొన్ని మత్తుమందులు వచ్చి చేరాయి. అవే సంక్షేమం పేరుతో అసంబద్ధ తాయిలాల్ని ప్రకటించటం, మద్యాన్ని ఆదాయమార్గంగా (రాజకీయ నేతలకు మద్యనిషేధం ద్వారా కూడా) మార్చడం. సామాన్య ప్రజలకు సంక్షేమం ద్వారా కలిగే లబ్ధి కన్నా విచ్చలవిడి మద్యం ద్వారా జరుగుతున్న నష్టం ఎక్కువని తెలిసినా కూడా మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు.

■ ప్రజలు మా కన్నబిడ్డల్లాంటివారు అని చెప్పుకుంటున్న

## ఆర్భాటం తప్ప మాఫియాలపై చర్యలేవీ?



డ్రగ్స్‌ను నిర్మూలించటంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఇసుక మాఫియా, ల్యాండ్ మాఫియా, డ్రగ్ మాఫియా, ఇలా మాఫియాలు విస్తరిస్తున్నా ప్రభుత్వం నియంత్రించే గట్టి చర్యలు తీసుకోలేకపోతోందని లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దోసపాటి రాము అన్నారు. పరిపాలన అదుపుతప్పుతోందన్నారు. అల్లాపూర్‌లో లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో డ్రగ్ మహమ్మారి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ప్రభుత్వం కేసుల గురించి హడావుడి చేస్తూ ఆ తర్వాత వదిలేస్తోందని రాము ఈ సందర్భంగా అన్నారు. ఎస్ఐ మోహన్‌రెడ్డి కేసు, నయీం కేసు, భూఆక్రమణల కేసులను ఇలాగే నీరుగార్చారన్నారు. డ్రగ్స్ వ్యవహారంలో కూడా ఇవే పోకడలు కన్పిస్తున్నాయన్నారు. హైదరాబాద్‌లో విచ్చలవిడిగా పబ్‌లకు అనుమతులిచ్చిన తెరాస ప్రభుత్వం.. అవి చట్టవిరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నా చర్యలు తీసుకోవటం లేదన్నారు. చట్టబద్ధ పాలన సక్రమంగా అమలుచేయాలని, డ్రగ్స్ విషయంలో దూరదృష్టితో పాఠశాల స్థాయి నుంచీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లోక్‌సత్తా పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ అధ్యక్షుడు వంశీ ప్రసాద్ మాట్లాడుతూ, డ్రగ్స్ సరఫరాదారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని, వారి ఆస్తులను జప్తు చేయాలని అన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు సామ కొండల్‌రెడ్డి, గంగాభవానీ, రామరాజు, జీవన్‌లత, పి.భవానీ, వర్మ, కిషోర్, దుర్గారావు, మోహన్‌కృష్ణ, సునీల్ తదితరులు పాల్గొన్నారు

నాయకులు మనలోని శక్తిసామర్థ్యాలను వికసింపచేసుకునే మంచి విద్యను అందించటం లేదు.

- మనలో ఇంగితజ్ఞానంతో ఆలోచించే శక్తిని కూడా చంపేసేలా మద్యం విధానాన్ని అనుసరిస్తున్నారు.
- తలెత్తుకుని ఆదాయాన్ని సంపాదించే అవకాశాల్ని కల్పించకుండా ఉచితాల పేరుతో తాయిలాల్ని కుమ్మరిస్తున్నారు.
- బానిస మనస్తత్వాన్ని, బాబ్బాబూ అని యాచించే సంస్కృతిని పెంచుతున్నారు.
- కులాల, మతాల నిషాని తలకెక్కిస్తున్నారు.

అంతర్గత శక్తులను వికసింప చేసుకుని ఎదిగేందుకు తగిన చదువును, ఆరోగ్యాన్ని మనకు అందించకపోగా, ఉన్న మెదడును కూడా దెబ్బతీసే విధానాలతో మనల్ని ఇంకా మత్తులో, మకిలిలో ముంచుతున్నారు. మత్తును పెంచి పోషిస్తున్న ఇలాంటి రాజకీయ వ్యవస్థలో మాదకద్రవ్యాలు పెచ్చరిల్లటం ఆశ్చర్యాన్నేమీ కలిగించదు. అందుకే, ఇటీవల హైదరాబాద్ కేంద్రంగా బైటపడ్డ మాదకద్రవ్యాల విషవలయాన్ని ఛేదించాలంటే, మనమున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థలలోని మత్తు గురించి కూడా మనం అర్థం చేసుకోవాలి.

ప్రజల్ని ఆలోచనను, స్వావలంబనను దెబ్బతీసే ఆ సాంప్రదాయ మత్తు రాజకీయాన్ని ఎదుర్కోవడానికే లోక్‌సత్తా ప్రజల్ని ఆలోచింప చేసే, స్వతంత్రంగా ఎదిగేలా చేసే ప్రత్యామ్నాయ నిత్యచైతన్యపూరిత రాజకీయాన్ని జనం ముందు ఉంచింది. అందులో భాగంగానే.. భారత్ వదిలించుకోవాల్సిన ఏడు జాడ్యాలలో మాదకద్రవ్యాలు కూడా ఒకటని, ప్రపంచస్థాయికి ఎదగటానికి మనదేశం (నార్కోటిక్) డ్రగ్ విషవలయం నుంచి కూడా బైటపడాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చాలా ఏళ్లుగా చెబుతూ వస్తున్నారు.

పూర్వకాలపు రాజులు, పాశ్చాత్యదేశాల్లో సెలబ్రిటీలు తీసుకుంటున్నట్టుగా మన సినీ పరిశ్రమలో కూడా డ్రగ్స్ వినియోగిస్తున్నవారు ఉన్నా మనమేమీ హైరానా పడనక్కర్లేదు. సినిమా హీరోలు, హీరోయిన్లే రోల్‌మోడల్స్, ఈ దేశానికి నాయకులు అనే స్థాయిని దాటి ఆలోచించగలిగితే మనకు సినీ డ్రగ్స్ అసలు పెద్ద సమస్యగానే అనిపించవు. సినిమా వాళ్లను అడ్డం పెట్టుకుని తెలంగాణ ఎక్సయిజ్ విభాగం ప్రచారం పొందుతోంది, అధికారులు హీరోల్లా ఫోజులు కొడుతున్నారు.. వంటి విమర్శలనూ అతిగా పట్టించుకోనక్కర్లా. మిగతావాళ్లను వదిలేసి సినిమావాళ్ల గురించి ఎక్కువ ప్రచారం ఇస్తున్నారంటే ఆ తప్పు కేవలం పాలనా యంత్రాంగానిది కాదు గదా! ఒకరకంగా, ఇలాంటి సందర్భంలో అలా ప్రచారం వచ్చినా మంచిదే. ప్రజలకు సినిమా వాస్తవాలు అర్థమై,

## కుటుంబం, పాఠశాల, చట్టసవరణ కీలకం: జేపీ



మాదక ద్రవ్యాల వినియోగం వేగంగా పెరుగుతోంది. ఒకసారి, రెండుసార్లు సేవించినవారిని జైళ్లలో పెట్టడం మొదలుపెడితే ఉన్న కారాగారాలు చాలవు. అమెరికా వంటి దేశాల్లో ఇలాంటి కఠినచట్టం వల్ల లక్షలమంది జైళ్లలో మగ్గుతున్నా డ్రగ్స్ భూతం అదుపులోకి రావటం లేదు. వీటన్నిటినీ పరిగణలోకి తీసుకుని మనదేశం డ్రగ్స్ కట్టడికి చర్యలు తీసుకోవాలి. కుటుంబం, పాఠశాల, చట్టసవరణ.. ఈ మూడు చోట్లా చర్యలుండాలి. పిల్లలు, యువత ప్రవర్తనను అప్రమత్తంగా గమనిస్తూ, వారికి ప్రేమతో విలువల్ని, వ్యక్తిగత, సమాజ ప్రయోజనాలను తెలియచెప్పటానికి కుటుంబంలో మంచి అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు, ఇతర సభ్యులు ఈ విషయంలో తమ వంతు బాధ్యతను సక్రమంగా నెరవేర్చితే, సమస్యను నిరోధించవచ్చు, ప్రాథమిక దశలోనే నియంత్రించవచ్చు. డ్రగ్ ఎడిక్షన్ దశలో కూడా కుటుంబసభ్యుల తోడ్పాటుతో నయం చేయవచ్చు. ఇక విద్యాసంస్థల్లో, ముఖ్యంగా పాఠశాలల్లో.. తల్లిదండ్రుల భాగస్వామ్యంతో కౌన్సెలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఇందులో ఉపాధ్యాయులు కూడా చురుకైన పాత్ర పోషించాలి. ఇక చట్టం! చట్టాలు కఠినంగా, అమలు అధ్వాన్నంగా ఉండటం మనదేశంలో ఆనవాయితీ. ఈ ధోరణి మారాలి. చట్టాలు తేలిగ్గా, ఆచరణసాధ్యంగా, వాటి అమలు మాత్రం కఠినంగా ఉండాలి. ఇప్పుడున్న యాంటీ డ్రగ్ చట్టాన్ని కూడా అదేరీతిలో మార్చాలి. పరిస్థితుల ప్రభావంతో డ్రగ్స్ తీసుకున్నవారిని, అప్పుడప్పుడు తీసుకున్నవారిని కౌన్సెలింగ్‌కే పరిమితం చేయాలి. గంజాయిలాంటివి మాదక ద్రవ్యాలా అనే మీమాంసను కూడా లోతుగా చర్చించి తేల్చాలి. చాలాదేశాల్లో ఇలా జాబితాలో నుంచి కొన్నిటిని తొలగించారు. అలాకాకుండా పెద్దగా ప్రభావం చూపని డ్రగ్స్‌ను వాడేవారిని, అప్పుడప్పుడు సేవించినవారిని కూడా నేరస్తులుగా పరిగణిస్తే డ్రగ్ మాఫియాకు బలం చేకూరుతుంది. సాధ్యమైనంత వరకు డ్రగ్ మాఫియాకవలలో ప్రజలు చిక్కకుండా నిబంధనలుండాలి. డ్రగ్స్‌తో వ్యాపారం చేసేవారి పట్ల మాత్రం సరైన విచారణా ఏర్పాట్లతో కఠినమైన చర్యలుండాలి. తెలంగాణలోనే కాదు ఈ సమస్య ఆంధ్రప్రదేశ్‌లోనూ ఉంది. పంజాబ్ వంటి చోట్ల ప్రమాదకరంగా ఉంది. అందుకే రాష్ట్రాలు తమ పరిధిలో కుటుంబం, పాఠశాల, తేలికైన చట్టం కోణాల్లో చర్యలు తీసుకుంటూనే జాతీయస్థాయి ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటుండాలి. అప్పుడే మాదక ద్రవ్యాలను చాలామేర అదుపుచేయగలం.

– డా॥ జయప్రకాష్ నారాయణ్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు

మేకప్‌లో ఉన్న తారని చూసి అతిగా మురిసిపోవటం తగ్గిస్తారు. మన బలాల్ని పెంచుతూ ఆనందాన్ని పంచే ప్రయత్నం చేసే 'అర్థాంగి'లాంటి సినిమాలకు, బలహీనతలను రెచ్చగొడుతూ సొమ్ము చేసుకునే సినిమాలకు తేడాను కొంతైనా స్పష్టంగా గుర్తించగలుగుతారు. డ్రగ్స్‌పై అవగాహన కూడా యువతలో అవగాహన పెరుగుతుంది. పోలీసు సంస్కరణలపై కొంత ఆలోచన కూడా చేస్తారు. కాబట్టి ఆ సెలబ్రిటీలు, సంపన్నుల గొడవ వదిలేద్దాం. హైదరాబాద్‌లో బైటపడ్డ డ్రగ్ కలాపాల్లో ప్రమాదకరమైన కోణం పాఠశాలల దాకా వ్యాపించటం.

ఒక్క తెలంగాణ రాజధాని నగరంలోనే వెయ్యిమందికిపైగా పిల్లలు ఒక్క ముఠా ద్వారానే డ్రగ్స్ అందుకుంటున్నారు. ఇది ప్రజలను వ్యవస్థీకృతంగా నిర్వీర్యం చేసే పరిణామం. సాంప్రదాయ రాజకీయ పార్టీలు ప్రజలను ఆలోచించకుండా చేసేందుకు క్రమక్రమంగా వారిని అసంబద్ధ ఉచితాలు, తాయిలాలు, విద్వేషాలకు అలవాటు చేస్తుంటే, నార్కోటిక్ డ్రగ్స్ అనేకరెట్లు వేగంగా ఆ పనిచేస్తాయి. జాతి జీవనాడుల్ని దెబ్బతీస్తాయి. సరిహద్దు రాష్ట్రం పంజాబ్‌నే చూస్తే, ఏటా రూ. 7,500కోట్లు మత్తుమందులకే అక్కడి ప్రజలు ఖర్చుపెడుతున్నట్టు సమాచారం. మంచి శరీరాకృతి, దృఢత్వంగల ప్రజలు, వ్యవసాయదాయంగల పంజాబ్ ఇప్పుడు డ్రగ్స్ వల్ల అన్నిరకాలుగా బలహీనపడుతోంది. మనదేశంలో ప్రతి లక్షమందిలో 250మంది మత్తుమందు వినియోగదారులు ఉండగా (2012 అంచనా ప్రకారం), పంజాబ్‌లో 836మంది వాడుతున్నారు. ఈ సంఖ్య దేశవ్యాప్తంగా కూడా వేగంగా పెరుగుతోంది. 2004లో మనదేశంలో 2కోట్లమంది మత్తుమందు వాడకందారులు ఉంటే, ఆ సంఖ్య 2015కి 7కోట్లుగా పెరిగిందంటున్నారు. తెలంగాణలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇటీవల ఈ దందాలు పెద్దఎత్తున బైటపడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ విజయవాడలోని పలు కళాశాలల్లో క్యాంపస్‌లో డ్రగ్స్ సరఫరాకు అధ్యాపకులు

బెంబేలెత్తిపోతున్నారు. విశాఖలో కూడా చాలా కళాశాలల్లో మాదక ద్రవ్యాల్ని వినియోగిస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖా మంత్రే స్వయంగా చెప్పారు. సాంతికేత పరిజ్ఞానం వేగంగా అందుబాటులోకి రావడం, సెల్‌ఫోన్‌లలో 4జీ సేవలతో మత్తుమందుల వినియోగం వేగంగా పెరగడానికి కారణమవుతోంది. (డార్క్) నెట్‌లో ఆర్డర్, బిట్ కాయిన్లు వంటి క్రిప్టో కరెన్సీలో చెల్లింపు జరుగుతోంది. మతాన్ని మత్తుమందులా ప్రయోగిస్తున్న ఉగ్రవాదం కన్నా కూడా వేగంగా నార్కోటిక్ డ్రగ్స్ వినియోగం ప్రజల జీవితాల్ని కబళిస్తోంది. ఉగ్రవాదులకు, నేరముఠాలకు ఇదో పెద్ద ఆదాయమార్గంగా మారింది. అభివృద్ధి చెందిన దేశాలకంటే భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల డ్రగ్స్‌కు ఎక్కువగా కేంద్రాలవుతున్నాయి. దాదాపు రూ. 60,000-70,000కోట్ల డాలర్ల ప్రపంచ డ్రగ్ వ్యాపారంలో వర్ధమాన దేశాలదే ఎక్కువ వాటా. ఔషధ పరిశ్రమ విస్తరిస్తున్న భారత్‌లాంటి దేశాల్లో యాంఫటమైన్ టైప్ స్టిమ్యులెంట్లు (ఏటీఎస్) ఎక్కడబడితే అక్కడ తయారవుతున్నాయి. మాదకద్రవ్యాల చట్టాలు లోపభూయిష్టంగా ఉండటంతోపాటు యాంటీ నార్కోటిక్ డ్రగ్ విభాగాలు కూడా బలహీనంగా ఉండటంతో వీటి వ్యాప్తిని అరికట్టడం మాట అలా వుంచి పసిగట్టడం కూడా కష్టంగా మారింది. మన మధ్య ఓ పోలీసు కానిస్టేబులో, ఒక సామాజిక కార్యకర్తో డ్రగ్స్ సరఫరాను గుర్తించి అప్రమత్తమవటం దాదాపు సాధ్యమయ్యే పని కాదు. అందుకే తెలంగాణ అబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ చేసిన పనిని అభినందించాలి.

మద్యాన్ని ప్రోత్సహిస్తున్న విభాగమే అయినా, కొంత అతి వ్యవహారశైలిని కనబరిచినా.. ప్రముఖుల ఒత్తిడికి, డ్రగ్ మాఫియాకు భయపడకుండా ఓ భయంకర సమస్య నుంచి సమాజాన్ని కాపాడేందుకు చొరవ చూపారు. అందుకే లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు నేతృత్వంలో పార్టీ రాష్ట్ర నేతలు దుర్గారావు, సరోజాదేవి, గంగాభవానీ, విమలాదేవి తదితరులు అకున్ సబర్వాల్‌ని కలిసి అభినందించారు.

రాష్ట్రంలో మాదక ద్రవ్యాల లావాదేవీలతో సంబంధమున్నవారందరి మీదా కఠిన చర్యలు తీసుకోవాలని, అంతకంటే వేగంగా ఆ పెనుముప్పు నుంచి విద్యార్థులను కాపాడటానికి పాఠశాలల్లో, కళాశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులతో కూడిన డ్రగ్స్ నిరోధక కమిటీలను చట్టబద్ధంగా ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా నేతలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌ని కోరారు. ఏరూపంలోనైనా విద్యాసంస్థల్లో కౌన్సెలింగ్ వ్యవస్థను తల్లిదండ్రుల భాగస్వామ్యంతో కచ్చితంగా ఉండేలా చేయాలన్నారు. జాతి ఆలోచనాశక్తిని దెబ్బతీసే ఈ దారుణం మీద ప్రభుత్వ యంత్రాంగం పెద్దఎత్తున యుద్ధం ప్రకటించాలని కోరారు. టీచర్లు, లెక్చరర్లు, తల్లిదండ్రులతో కూడిన కమిటీల ఏర్పాటు, పాఠశాలల ఆవరణల్లో గోడల మీద డ్రగ్స్ అలవాటు చేసే తీరు, పర్యవసానాల బొమ్మలు వేయటం, మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై ఓ పాఠ్యాంశాన్ని చేర్చటం తదితర చర్యలను సూచించారు. ఓట్ల కొనుగోలు కోసం కొందరు రాజకీయ నాయకులు, సమాజం మీద ఎక్కువ ప్రభావం చూపే సినిమా నటులు కూడా ఇందులో భాగస్వాములుగా ఉన్నారని, వీరిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. ప్రమాదం ఈ స్థాయిలో ముంచుకొచ్చేదాకా చోద్యం చూస్తున్న నార్కోటిక్-కంట్రోల్ బ్యూరో, రెవెన్యూ ఇంటెలిజెన్స్ తదితర విభాగాల పనితీరును మెరుగుపరచాలని స్పష్టం చేశారు.

విద్యార్థులకు సంబంధించి లోక్‌సత్తా పార్టీ సూచనల్ని వెంటనే అమలు చేయటం అవసరమని, అయితే డ్రగ్స్‌ను పర్యవేక్షించడానికి ఉపాధ్యాయులు, లెక్చరర్లు, తల్లిదండ్రులతో చట్టబద్ధ కమిటీ వేసే అధికారం తమ పరిధిలో లేదని, ఇందుకోసం విద్యాశాఖకస్పందించాలని అకున్ సబర్వాల్ తెలిపారు.

ఆ తర్వాత లోక్‌సత్తా విద్యాశాఖకు ఇదే అంశం అమలుకోరుతూ విద్యాశాఖకు లోక్‌సత్తా లిఖితపూర్వక విజ్ఞాపన అందించింది. పాఠశాలల్లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా లోక్‌సత్తా తరపున కూడా దీర్ఘకాల ప్రచారాన్ని చేపడతామని తెలిపింది. లోక్‌సత్తా సూచనను పరిగణలోకి తీసుకుని అకున్ సబర్వాల్ కూడా కమిటీలు వేయండని సూచిస్తూ విద్యాశాఖకు ఎక్సయిజ్ విభాగం కూడా లేఖ రాసేందుకు చొరవ చూపారు.

విద్యార్థుల్లో డబ్బున్నవాళ్ల పిల్లలే డ్రగ్స్ ఉపయోగిస్తున్నారని మనం ఉదాసీనత వహించే పరిస్థితి లేదు. పలు పత్రికల వార్తాకథనాలల్లో పేర్కొన్నట్టు.. మాదక ద్రవ్యాల పరిస్థితి బైటకొస్తున్న వివరాల కంటే తీవ్రంగా ఉంది. సాధారణస్థాయి స్కూళ్లు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు కూడా పప్పుబెల్లాల్లా వీటిని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

అందువల్ల సమాజం వేగంగా మేలుకోవాల్సుంది. ప్రభుత్వం చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునేలా చేయడంతోపాటు టీచర్లు, లెక్చరర్లతో కమిటీలు వేయించి అందులో తల్లిదండ్రులు కూడా చురుకైన పాత్ర పోషించాలి. కౌన్సెలింగ్ వ్యవస్థను పటిష్టంగా ఏర్పరచాలి. కుటుంబంలోనూ జాగ్రత్త వహించాలి. ఒకటిరెండు సార్లో, ఏవో కొన్ని సందర్భాలలోనో డ్రగ్స్ వినియోగించిన వారందరినీ దోషులుగా చూడకుండా డ్రగ్స్‌తో వ్యాపారం చేసేవారి పట్ల మాత్రం కఠినంగా వ్యవహరించేలా చట్టంలో మార్పులు తెచ్చుకోవాలి. ఒకప్పుడు దొంగలంటే ఎలా ఉండేవారు అని పెద్దలలో కూడా ఉత్సుకత ఉండేది. సినిమాల్లో కూడా దొంగలు, నేరస్తులకు ప్రత్యేకమైన గెటప్‌లు ఉండేవి. కానీ ఈరోజు దొంగలు, నేరస్తులు అంటే ఎక్కడో ఉండరు.. మన మధ్యే ఉంటారు, మన కుటుంబాల నుంచే వస్తారు అని సులభంగానే అర్థమవుతోంది. అంతలా అవాంఛనీయ ధోరణులు, సంస్కృతి ప్రబలిపోతోంది. ఈ తప్పు కాలానిది కాదు. ఇలాంటి అవకాశాలుంటే పాతకాలంలో కూడా ఇదే స్థాయిలో అరాచకాలు జరిగివుండేవి. దీన్ని నియంత్రించే వ్యవస్థను మనం ఏర్పరచుకోవాలంతే. ఇది పూర్తిగా మన చేతుల్లోనే ఉంది.

మద్యం విషయంలో తీసుకునే చర్యలనే మాదక ద్రవ్యాల విషయంలో కఠినంగా తీసుకోవాలి. పబ్‌లలో, ఇతర చోట్ల డ్రగ్స్ తీసుకునే సంపన్నుల గురించి అతిగా పట్టించుకోకుండా, వారి జీవితాల్లో తొంగి చూసే అనవసర కుతూహలాన్ని ప్రదర్శించకుండా.. సామాన్యులు, యువత, విద్యార్థులు వీటి బారిన పడకుండా పకడ్బందీగా వ్యవహరించాలి.

వీటితోపాటు ఆలోచనను చంపేసే, యాచకులుగా మార్చే రాజకీయం, విధానాల స్థానంలో.. ఆలోచింప చేసే, తలెత్తుకునే బతికేలా, బాధ్యత తీసుకునేలా చేసే రాజకీయాన్ని, విధానాలను పెంపొందించుకోవాలి. ఈ సమగ్ర కార్యాచరణతోనే మాదకద్రవ్యాలను కట్టడిచేయగలం, సాంకేతిక పరిజ్ఞానాన్ని మన నిజమైన అభివృద్ధికి, సుఖసంతోషాలకు వినియోగించుకోగలం. ఇవి చేయకుండా కేవలం యోగా, సంప్రదాయాలు అంటూ బోధలు చేసి ప్రయోజనం లేదు.

హైదరాబాద్ సహా భారత్‌లోని చాలా నగరాలు ఇప్పుడిప్పుడే విస్తరిస్తున్నాయి. వీటిల్లో ప్రజలు ఒకరి ముఖాల్ని ఇంకొకరు గుర్తుపట్టగల ఏరియాలే ఎక్కువ. అందుచేత మనం పైన చెప్పుకున్న చర్యలతో సంకల్పిస్తే.. మనదేశంలోని చాలాచోట్ల వేగంగానే డ్రగ్ మాఫియాను పూర్తిగా కట్టడి చేయగలం, నిరోధించగలం.

యుద్ధాలు జరగాల్సింది దేశాల మధ్య కాదు.. ప్రజలను పీడిస్తున్న దోపిడీ రాజకీయాలు, డ్రగ్స్ వంటి పెనుసమస్యల మీద. ⊙

# కల్తీ విత్తనాలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం

రికార్డులు, సర్వేల పేరుతో రైతులకు ఇవ్వాల్సిన రాయితీలకు తెలంగాణ ప్రభుత్వం గండికొడుతోందని లోక్‌సత్తా పార్టీ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లేటి రమేష్ కుమార్ ఆరోపించారు. ఒక్కరోజులో రాష్ట్రం మొత్తం ఇంటింటి సర్వే చేసి వివరాలు సేకరించిన ఘనత వున్న ప్రభుత్వానికి రైతుల భూముల రికార్డులను సర్వే చేయటం, సరిదిద్దడం పెద్ద విషయమా? అని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రెండు సీజన్లలో ఇస్తానన్న ఎకరానికి నాలుగు వేల రూపాయలకు కూడా కుంటిసాకులు చెబుతున్నారన్నారు. వచ్చే సంవత్సరం నుంచి ఇస్తే ఎన్నికల కోసమే అవుతుందన్నారు. కల్తీ విత్తనాలు, ఎరువులను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వం వెంటనే రైతులకు బ్యాంకుల ద్వారా రుణాల్ని అందించే ఏర్పాటు చేయాలన్నారు. రైతుకు ఆదాయం అందించకుండా ఎన్ని చెప్పినా వ్యవసాయాన్ని బాగుచేయలేరని, తాయిలాలకు బదులు ధరల స్థిరీకరణ నిధి, మెరుగైన ధర వచ్చేందుకు మార్కెట్‌ల ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. చివ్వెంల మండలంలోని ఉండ్రుగొండలో సీసీ రోడ్లు నిర్మించి గ్రామాన్ని అభివృద్ధి చేయాలని రమేష్ కుమార్ అన్నారు. ఆధ్యాత్మిక క్షేత్రంగా ఎంతో ప్రాధాన్యత ఉన్నా ఉండ్రుగొండ గత 30ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు రోడ్లు బురదమయమై నడవడానికి కూడా వీలులేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామంలో ఒక్క సీసీ రోడ్డు కూడా వేయలేదంటే అభివృద్ధి ఏ చందంగా ఉందో గ్రహించవచ్చన్నారు. సమావేశంలో కిరణ్, నాగరాజు, శ్రవణ్, పుష్ప తదితరులు పాల్గొన్నారు ⊙

# చిన్న గ్రామం నుంచి హైదరాబాద్, విజయవాడ వంటి సిటీల వరకూ అలందూర్ అద్భుతాన్ని సాధించుకోవచ్చు: ఆర్ఎస్ భారతి "ఎన్నికల ప్రచారంలా జనచైతన్య కార్యక్రమాన్ని నిర్వహించాం, ప్రజల్ని భాగస్వాముల్ని చేశామని" వెల్లడి



తమిళనాడులోని అలందూర్ మునిసిపాలిటీ లక్ష లోపు జనాభా ఉన్న చిన్న పట్టణం. ప్రస్తుతం చెన్నై కార్పొరేషన్‌లో భాగంగా ఉంది. మనదేశంలో స్థానిక వనరులతో, పౌరుల మద్దతుతో చక్కటి పారిశుద్ధ్య వ్యవస్థను నిర్మించుకున్న మొట్టమొదటి చిన్న పట్టణం ఘనతను అలందూర్ సాధించింది. ఇక్కడి స్థానిక ప్రభుత్వం ప్రజలకు వారు కట్టిన ప్రతి రూపాయికీ లెక్కచెబుతూ పారదర్శకంగా ప్రాజెక్టును పూర్తిచేసింది. దీంతో, అక్కడి జనం కొద్దికాలంలోనే పారిశుద్ధ్యం, ఆరోగ్యం, సుందరీకరణ వంటివి సాధించి లాభపడ్డారు. వారి ఇళ్ళ స్థలాల ధరలు కూడా భారీగా పెరిగిపోయాయి. నేషనల్ వాటర్ అవార్డు వంటి పురస్కారాలూ వచ్చి చేరాయి.

అలందూర్‌లో స్థానిక ప్రజల భాగస్వామ్యంతో భూగర్భ మురుగునీటి వ్యవస్థను నిర్మించటానికి ముందు, అంటే 1997 ప్రాంతంలో పట్టణంలో మురుగునీటి వసతి అధ్వాన్నంగా ఉండేది. ఇళ్ల నుంచి వ్యర్థ జలాలను ప్రధానంగా సెప్టిక్ ట్యాంకులలో సేకరించేవారు. ఆ నీటిని ఓపెన్ నాలాల్లో వేయటం వల్ల అనారోగ్యకర పరిస్థితులు తాండవిస్తుండేవి. సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేయడానికి వాహనాలు అందుబాటులో ఉండేవి కావు. మనుషులు కూడా దొరికేవారు కారు. ఈ నేపథ్యంలో మునిసిపల్ ఛైర్మన్ ఆర్.ఎస్ భారతి స్థానిక పరిస్థితులను మెరుగుపరచటం వల్ల లబ్ధి పొందేవారందరినీ ఆ ఉమ్మడి లక్ష్యం దిశగా ఒక తాటి మీదకు తెచ్చారు. మునిసిపాలిటీకి వనరులు లేకపోవటంతో కమ్యూనిటీ భాగస్వామ్యంతో పీపీపీ నమూనాను అనుసరించాలని అందరూ అంగీకరించారు. ఆ సమయంలో తమిళనాడు ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు నిధులతో పట్టణ ప్రాంతాల్లో చేపడుతున్న మురుగునీటి వ్యవస్థ నిర్మాణ ప్రాజెక్టులో అలందూర్ కూడా ఉండేలా భారతి చొరవ తీసుకున్నారు. మొత్తం 12 పట్టణాలను రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు ఎంపిక చేసింది. అలందూర్‌లో ప్రతిపాదించిన ప్రాజెక్టులో 19 కిలోమీటర్ల భూగర్భ మురికినీటి వ్యవస్థ, 101 కిలోమీటర్ల కనెక్షన్లు, మురుగునీటిని పంపే కేంద్రం, మురుగు నీటి శుద్ధి కేంద్రం తదితరాలున్నాయి.

అలందూర్ అద్భుతాన్ని సాధించటానికి దశాబ్దానికి ముందే, 1986 ప్రాంతంలో లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్ ప్రకాశం జిల్లాలో కలెక్టర్‌గా ఇదే తరహాలో ప్రజల భాగస్వామ్యంతో సాగునీటి రంగంలో రికార్డు విజయాన్ని నమోదు చేశారు. ప్రకాశం జిల్లాలో రైతులను సమీకరించి, వారి భాగస్వామ్యంతో, వారి సొంత పనిగా, కొత్త చిన్న సాగునీటి పథకాల ద్వారా సుమారు 2,00,000 ఎకరాలకు (అన్ని రకాల పథకాలూ కలుపుకుని) ప్రభుత్వ పథకాల వ్యయంలో నామమాత్రపు ఖర్చుకే నీరందించారు. గుండ్లకమ్మ, పాలేరు, మూసీ, మానేరు నదులపై, ఓగేరు తదితర డ్రెయిన్లపై 453 మైనర్ ఎత్తిపోతల పథకాలు, 70 మళ్లింపు పథకాలు, 2800 బోరు బావులతో జనం భాగస్వామ్యం ద్వారా ఈ రికార్డును జేపీ సాధించారు. స్థానిక ప్రభుత్వాల సాధికారతలో భాగంగా దేశంలోని ఏ ప్రాంతంలోనైనా అనుసరించటానికి వీలైన ప్రాజెక్టుల వివరాలను ప్రజలకు తెలియచేస్తుండే లోక్‌సత్తా/ ఫౌండేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) అధ్యయన బృందం.. ఇటీవల ప్రకాశం జిల్లాకు వెళ్లి 30 ఏళ్ల క్రితం జేపీ ప్రారంభించిన తొలి ఎత్తిపోతల పథకం పనితీరును ఉలిచి గ్రామంలో పరిశీలించి వచ్చింది. ఆ తర్వాత అలందూర్ దశ, దిశను మార్చిన ఆర్.ఎస్ భారతితోనూ మాట్లాడింది. ప్రస్తుతం ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు.

ఎఫ్‌డీఆర్ ఇంటెర్న్స్ అనీష్, గణేష్ (ఐఐటీ మద్రాస్), ఈశ్వర్ (ఎన్ఐటీ–త్రిచి) ఆర్ఎస్ భారతితో చేసిన టెలిఫోనిక్ ఇంటర్వ్యూ సారాంశాన్ని మరో ఇంటెర్న్ సంతోష్ (బీటెక్) లోక్‌సత్తా టైమ్స్ పాఠకులకోసం తెలుగులో అందించారు..

**ఎఫ్‌డీఆర్ టీం: ప్రభుత్వ ప్రాజెక్టుకు ప్రజలు సొంత డబ్బులిచ్చి వ్యక్తిగత భాగస్వాములయ్యేలా ఎలా చేయగలిగారు?**

**ఆర్ఎస్ భారతి:** ప్రాజెక్టులో భాగంగా మురుగునీటి పారుదల కనెక్షన్ తీసుకోవటానికి ఒక్కొక్కరూ రూ. 5,000 ప్రారంభంలో కట్టాలి. ఇందుకు ప్రజలను ఒప్పించటానికి నేను పూర్తి బాధ్యత తీసుకున్నాను. ప్రతి ఇంటికీ వెళ్లి భూగర్భ మురుగునీటి వ్యవస్థ వల్ల లాభాలను వివరించాను. ఆ ప్రాజెక్టు అమల్లోకి వచ్చాక వారి జీవితాలు ఎలా మెరుగవుతాయో తెలియచేశాను. ఎన్నికలప్పుడు ఎలా ప్రచారం చేస్తామో, అలా ఈ జనచైతన్య కార్యక్రమాన్ని నిర్వహించాం. ఐదేళ్లలోనే మొత్తం ప్రాజెక్టును పూర్తి చేశాం. 10,000 కనెక్షన్లు ఉంటే చాలని ప్రాజెక్టులో నిర్దేశించారు. కానీ ఇప్పుడు 30,000 కనెక్షన్లతో దిగ్విజయంగా ప్రాజెక్టు నడుస్తోంది.

1986 నుంచి అలందూర్ మునిసిపాలిటీకి నాలుగుసార్లు ఛైర్మన్‌గా పనిచేశాను. 1986లో ఇదే తరహాలో ప్రజల భాగస్వామ్యంతో మునిసిపల్ కుళాయి నీటిని అందించాను. ఇది అద్భుత విజయం సాధించింది. ప్రజల్లో విశ్వాసాన్ని పెంచింది. సాధారణంగా ప్రభుత్వ ప్రాజెక్టు అంటే జాప్యాలు, నాణ్యత లేకపోవడాలు ఉంటాయని ప్రజల్లో అభిప్రాయం ఉంటుంది. కానీ కుళాయి నీటిని పారదర్శకంగా వారి భాగస్వామ్యంతో అందించటంతో, మురుగునీటి వ్యవస్థ ప్రాజెక్టు ప్రతిపాదన పట్ల కూడా ప్రజలు సానుకూలంగా స్పందించారు. ప్రాజెక్టు పని ఎక్కడా ఆలస్యం లేకుండా పక్కాగా ఉండటంతో భాగస్వాములు కావటానికి వారు ఏమాత్రం సంకోచించలేదు.

**(?) ప్రాజెక్టు అమలు, ప్రజల భాగస్వామ్యం సాఫీగా జరగటానికి వ్యవస్థాపరంగా చేసిన ఏర్పాట్ల గురించి చెబుతారా**

ప్రతి ఏరియాలో రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లను ఏర్పాటు చేశాం. ప్రారంభ డిపాజిట్‌గా నిర్ణయించిన రూ. 5,000ను వాటి ద్వారా సేకరించాం. ప్రాజెక్టుకు సహకరించినవారి పేర్లను అందరికీ కనిపించేటట్టు డిస్‌ప్లే బోర్డులో పెట్టాం. డిపాజిట్ కట్టనివారెవరో అందరికీ తెలిసిపోయేది. దీంతో అపరాధ భావన కలిగి అందరూ సాధ్యమైనంత త్వరగా డబ్బు ఇచ్చేశారు. ఇంతకుముందే చెప్పినట్టు ఎన్నికల ప్రచారంలా ఈ జనచైతన్య కార్యక్రమాన్ని నిర్వహించాం. మునిసిపల్ కమిషనర్, కౌన్సిలర్లు





కూడా నాతోపాటు తిరుగుతూ కష్టపడ్డారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఐవీసీఆర్ఎల్ అనే కంపెనీ ఈ ప్రాజెక్టులో ప్రయివేటు భాగస్వామిగా ఉండేది. ఆ కంపెనీ నిపుణులు కూడా ఈ స్కీము వల్ల లాభాలను ప్రజలకు వివరిస్తుండేవారు.

**(?) కొత్త బీవోటీ నమూనాలో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టు పట్ల వ్యతిరేకత రాలేదా? మొదట రూ. 5,000 డిపాజిట్, ఆ తర్వాత నెలవారీ ఫిక్స్‌డ్ ఛార్జీలు అంటే ప్రజలు సిద్ధపడ్డారా**

ఏ ప్రాజెక్టుకైనా తొలుత వ్యతిరేకత వచ్చే, అనుమానాలు వ్యక్తమయ్యే అవకాశాలుంటాయి. పాలకులు, యంత్రాంగం వాటిని పరిష్కరించి, ప్రాజెక్టు వల్ల వచ్చే లాభాలేమిటో సామాన్య ప్రజలకు వివరించగలగాలి. అలందూర్ మునిసిపల్ కౌన్సిల్‌లో అనేక పార్టీలకు చెందినవారున్నా, వారంతా ఈ ప్రాజెక్టు విషయంలో ప్రజాప్రయోజనానికి కట్టుబడి వ్యవహరించటంతో నేను విజయం సాధించగలిగాను. ప్రాజెక్టును అమలుచేయాలని కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది.

మా చైతన్య కార్యక్రమం ఇంటింటికీ చేరటంతో ప్రజలు కూడా వాస్తవాల్ని అర్థం చేసుకుని స్వచ్ఛందంగా రూ. 5,000 కట్టారు.

**(?) ప్రాజెక్టును చేపట్టాక జవాబుదారీతనానికి, పారదర్శకతకు ఎటువంటి చర్యలు తీసుకున్నారు**

రెసిడెంట్స్ అసోసియేషన్ సభ్యులతో ఒక పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేశాం. బీవోటీ కంపెనీ గనక నిబంధనలకు తగ్గట్టు

నిర్మాణం చేయకపోతే జరిమానా విధించవచ్చు. ప్రాజెక్టు నిర్మాణంలోని ప్రతి దశనూ ఈ పౌర కమిటీ నిశితంగా గమనిస్తూ వచ్చింది. వివరాలను ఎప్పటికప్పుడు సాధారణ ప్రజలకు తెలియచేసింది. ఆర్థిక అవకతవకలు జరగకుండా అలందూర్ మునిసిపాలిటీ అండర్‌గ్రౌండ్ సివరేజ్ స్కీమ్ పేరుతో ప్రత్యేక బ్యాంక్ అకౌంట్‌ను పంజాబ్ నేషనల్ బ్యాంకులో తెరిచాం. డిపాజిట్లు, ఛార్జీలు, రుణాలు అన్నీ ఈ అకౌంట్ ద్వారానే. వీటన్నిటినీ పర్యవేక్షించటానికి మళ్లీ పైస్థాయిలో ప్రత్యేక కమిటీని వేశాం. ఇందులో నాతోపాటు మునిసిపల్ కమిషనర్, స్థానిక రిజిస్టర్డ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ల నుంచి ముగ్గురు ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు.

**(?) రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు వగైరాల విషయంలో ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొన్నారా**

ఆ సమయంలో డీఎంకే అధికారంలో ఉంది. అధికార పార్టీలో సభ్యుడిని కావటంతో పని తేలికైంది. అయితే ఈ ప్రాజెక్టు విషయంలో క్రెడిట్ ప్రధానంగా ప్రభుత్వ కార్యదర్శి మాలతికి చెందుతుంది. అలందూర్‌లో ఈ స్కీముకు ఆమే చొరవ చూపారు. ప్రతి దశలోనూ ప్రభుత్వం వైపు నుంచి అన్ని రకాల సహకారాన్ని అందించారు.

**(?) అలందూర్ ప్రాజెక్టు విజయానికి దోహదం చేసిన అంశాలేమిటి? హైదరాబాద్, విజయవాడ లాంటి ఇతర మునిసిపాలిటీల్లో దీన్ని పునరావృతం చేయవచ్చా**

స్థానిక ప్రభుత్వాల ప్రతినిధులు, ప్రజల కమిటీల మధ్య సమన్వయం ఈ విజయానికి ఒక ప్రధాన కారణం. ప్రజలకు వాస్తవాలు తెలియచేసేందుకు పార్టీలకతీతంగా అన్ని రాజకీయపక్షాల నేతలూ పెద్దఎత్తున ప్రచారం చేయటం, అంతకుముందు ఇదే తరహాలో కుళాయి ద్వారా మంచినీరు అందించిన రికార్డు నాకు ఉండటం వంటి వాటి వల్ల మా బృందానికి విశ్వసనీయత సమకూరింది. ప్రాజెక్టును ప్రకటించగానే ప్రజలు స్పందించి డబ్బు చెల్లించారు. మొత్తం ప్రాజెక్టులో దాదాపు 31శాతాన్ని ప్రజలే భరించారు. ఇందుకు అవసరమైన భూమిని స్వచ్ఛందంగా అందించారు. కొన్ని ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వటానికి పైపులు లభించకపోతే, కొన్ని ఇళ్లవారు రూ. 10,000 కూడా చెల్లించారు.

రెండోది, ప్రాజెక్టు వ్యయాన్ని వీలైనంత తగ్గించేందుకు అన్ని దశల్లోనూ ప్రయత్నించాం. ఖర్చు తగ్గించేందుకు ఏ ఒక్క అవకాశాన్నీ జారవిడవలేదు.

ఈ రెండూ ఏ ప్రాంతంలోనైనా సాధ్యం. కాబట్టి ప్రజలకు మేలుచేసే ప్రతిపాదన, విశ్వసనీయ సమర్థ నాయకత్వం, స్థానిక కౌన్సిలర్లు/ కార్పొరేటర్ల మద్దతు ఉంటే ఒక చిన్న గ్రామం లేదా హైదరాబాద్, విజయవాడ లాంటి నగరాలలో అలందూర్ తరహా ప్రాజెక్టును పునరావృతం చేయవచ్చు. త్రిచి, తంజావూరు, తిరునెల్లి, అంబత్తూరు సహా తమిళనాడులో ఇప్పటివరకూ 50 మునిసిపాలిటీలు ఈ నమూనాను అనుసరించాయి. ⊙

## ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

బీజేపీ ప్రతిపాదించిన ఎం. వెంకయ్య నాయుడు భారత నూతన ఉపరాష్ట్రపతి అయ్యారు. వెంకయ్య దక్షిణాదికి చెందినవారు కావటం, ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితం దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలతో ముడిపడి ఉండటం, వివిధ పార్టీలతో ఆయనకు సుహృద్భావ సంబంధాలు ఉండటంతో ప్రధాని మోదీ బృందం ఆయన అభ్యర్థిత్వం వైపు మొగ్గుచూపింది.

## మన ఎజెండాను సరిగ్గా తీసుకెళ్లండి.. జనమే చూసుకుంటారు





యువత, రైతులు, మహిళల సమస్యల్ని శాశ్వతంగా పరిష్కరించి తలెత్తుకు బతికే ఎజెండాను లోక్‌సత్తా మాత్రమే అందిస్తోందని, ఈ ఎజెండా మీదే పనిచేస్తూ పాలకుల తప్పుడు విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతుండాలని కార్యకర్తలకు బాబ్జీ సూచించారు. లోక్‌సత్తా పార్టీ ఎజెండా ప్రజల్లోకి సరిగా వెళితే చాలు జనమే చూసుకుంటారని, మార్పును సాధించుకుంటారని అన్నారు. ఎస్.కోట నియోజకవర్గంలో జరిగిన లోక్‌సత్తా పార్టీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండల ప్రెసిడెంట్ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు.

# విద్య, ఆరోగ్యం, ఉపాధిని అందించేవాడే మనవాడు: జేపీ









ఎడారిలో ఒయాసిస్ వంటిది బ్రాండిక్స్ కర్మాగారం అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. 30 ఏళ్ల క్రితమే బ్రాండిక్స్ లాంటి కర్మాగారాలు ఎన్నో మనదేశంలో రావాల్సి ఉందన్నారు. విశాఖ జిల్లా అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థికమండలిలోగల బ్రాండిక్స్ అపారెల్ సిటీ పరిధిలోని పరిశ్రమలను ఆయన సందర్శించారు. సిబ్బందిలో అత్యధికులుగా వున్న మహిళా ఉద్యోగులతో మాట్లాడారు. ఉపాధి, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు.

మనదేశంలో వనరులున్నప్పటికీ ఉద్యోగావకాశాలు కల్పించలేకపోతున్నామని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. దుస్తులరంగంలో 180 బిలియన్ డాలర్ల ఎగుమతులు చేస్తుండగా, దుస్తుల తయారీ రంగంలో పేరున్న మనదేశం మాత్రం కేవలం 18 బిలియన్ డాలర్ల ఎగుమతుల్నే చేస్తోందన్నారు. మనదేశంలో ఏటా 10లక్షలమంది నిరుద్యోగులు వస్తుంటే, చైనాలో ప్రతి సంవత్సరం 40లక్షలమంది కార్మికులు తగ్గిపోతున్నారని, అయినా దీన్ని సద్వినియోగం చేసుకునే సత్తాను భారత్ ప్రదర్శించలేకపోతోందని అన్నారు. ప్రపంచంలో మరెక్కడా ఈ స్థాయిలో వనరుల్ని చేజార్చుకునే దేశం కనిపించదన్నారు. పరిపాలనలో లోపం కావచ్చు, విధానాల్లో, మౌలిక వసతుల్లో లోపం కావచ్చు, విద్య అధ్వాన్నంగా ఉండటంతో నైపుణాలు కొరవడటం కావచ్చు, పిచ్చి రాజకీయాలు వంటి కారణాల వల్ల కావచ్చు.. మనదేశంలో ఉపాధి కల్పించలేకపోతున్నామన్నారు. ఇటువంటి నేపథ్యంలో ఈ బ్రాండిక్స్ కర్మాగారాన్ని చూస్తే ఎడారిలో ఒయాసిస్‌లా కనిపిస్తోందన్నారు. అందుకే ఒక పౌరునిగా సందర్శించటానికి వచ్చానన్నారు. మనకన్నా చిన్నదేశమైన శ్రీలంకకి చెందిన ఒక్క వ్యక్తి ఏర్పాటు చేసిన కర్మాగారం వేలమందికి ఉపాధి కల్పిస్తోందన్నారు. పెళ్లికి కోట్లు ఖర్చు పెట్టే వారున్న మనదేశంలో ఉపాధిని కల్పించటంలో మాత్రం ఎందుకు వెనకబడ్డామో అందరూ ఆలోచించాలన్నారు. కబుర్లతో బీదరికం పోదు, రాజకీయ ఆర్భాటాలతో ఉపాధి రాదు అన్నారు. ఉపాధి కల్పించటంతోపాటు సంపద సృష్టించేవారే మనకు ముఖ్యమైన దేవుళ్లని తాను భావిస్తానన్నారు. ప్రస్తుత సమాజంలో కులం, మతం, దేశం, రాష్ట్రం ఇలాంటి విభేదాలతో జీవిస్తున్నారని, ఎవరైతే ఉపాధి, ఆరోగ్యం, విద్య అందిస్తారో వాడే మనవాడిగా గుర్తించిన రోజున దేశం బాగుపడుతుందన్నారు. 130 కోట్ల జనాభాలో 3కోట్ల మందికి సంఘటిత ఉపాధి కల్పిస్తే చాలదన్నారు. ఏటా 1.3కోట్ల మందికి ఉపాధి అవకాశాలు కావాల్సి ఉండగా, ప్రస్తుతం ఏటా కొన్ని లక్షలమందికే వాటిని కల్పించగలుగుతున్నామని అన్నారు. విద్య, ఆరోగ్యం, ఉపాధినిచ్చే సంస్థలను ఆధునిక దేవాలయాలుగా భావించాలన్నారు.

బ్రాండిక్స్ భారతీయ భాగస్వామి దొరైస్వామి పార్కు పరిధిలోని యూనిట్లను చూపించి ఉత్పత్తులు, విశేషాలను జేపీకి వివరించారు. బ్రాండిక్స్ సీఈవో రఘుపతి, శ్రీలంక ప్రతినిధి ఉదితా వీరబాహు, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, నేతలు వేణుగోపాల్, సాంబశివరావు, లెక్కల శ్రీను, శంకర్, తులసీరాం, దోని నూకరాజు తదితరులు పాల్గొన్నారు. ⊙








యూత్ ఫర్
బెటర్ ఇండియా
(వైబీఐ)
ప్రతినిధులతో
హైదరాబాద్‌లో
జరిగిన
సమావేశంలో
లోక్‌సత్తా వ్యవస్థాపకుడు
డా॥ జయప్రకాష్ నారాయణ్

**VIZIANAGARAM:**
TARUN-8125288224
**SRIKAKULAM:**
SANTHOSH-9701436159
**VIZAG:**
SUNIL-8978448762
VINOD-9030569716
**RAJAHMUNDRY:**
UDAY-9700769442
**KAKINADA:**
KARIMALASWAMI-9963336544
**BHIMAVARAM,ELURU:**
SANTOSH-8497989155

**VIJAYAWADA,GUNTUR:**
CHAITANYA-8247229434
**ONGOLE,NELLORE,THIRUPATI:**
SRAVAN-9052906668
**ANANTAPUR**
SRAVANTH-9441224232
**HINDUPUR:**
MUJIB-9908484453
**KADAPA:**
GIRISH-9490035274
**KURNOOL:**
VIJAY-9948527272
**TELANGANA:**
SHIVA-9550464607

YOUTH for better INDIA

Posting Date 22-08-2017
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on August 16th, 2017

# ప్రపంచంలోనే అతి పెద్ద కలనుగన్న సాహసి

## JP Narayan, only INDIAN who has got 7 Major Acts & 3 Const.Amendments

fb.com/JPism

RTI Act
2005

Lokpal Act
2011

Gram Nyayalaya
Act -2009

Limiting size of
Council of Ministers
(91st Amendment
2003)



National Rural
Health Mission
2005

NJAC - 2015
(122nd Amendment)

Political Funding
Reform Law 2003

2G Spectrum 2012
(122 licences
cancellation)

Anti
Defection Law - 2003
( 10th Schedule )

is ready to deliver **National Health Care Policy**

**for details visit : loksatta.org/health**

Book-Post
PRINTED MATTER

To

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B, 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad